Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU





అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 289 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 2 - 7 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# రాష్ట్రాభివృద్ధి – తెలుగు వారిని అందలం ఎక్కించటమే కూటమి లక్ష్యం

**- రాష్ట్రంలో ప్రజాభీష్టం ప్రకారమే కూటమి ప్రజా ప్రభుత్వ పాలన - పొదుపులో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శం - నేరస్థులకు వంతపాడే రాజకీయ పార్టీలు మనకెందుకు - సైకో సహకారంతోనే గొడ్డలి పార్టీ నేతల మాటలు, చేతలు - మావిగన్ అన్న వ్యక్తులు రాజధానికి రౌడీల్లా దండయాత్రలు - నెల్లూరు జిల్లా పున్నపువారిపల్లెలో పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**










**గూడూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రాభివృద్ధితో పాటు తెలుగు వారిని అందలం ఎక్కించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజాభీష్టం మేరకే సుపరిపాలన అందిస్తు న్నామని వివరించారు. ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగులు నింపే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం పున్నపువారిపాలెంలో బుధవారం పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజా వేదిక సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...."ప్రజలు చూపిస్తున్న అభిమానంతో పడుతున్న కష్టాన్ని మర్చిపోతున్నాం. గత పాల కులు నెల్లూరు జిల్లాను అశాస్త్రీయంగా విభజించారు. గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చి నెరవేర్చాం. సైదాపురం, కలవాయి మండలాలను కూడా నెల్లూరు జిల్లాలో కలిపాం. ప్రజల అభీష్టం ప్రకారమే పరిపాలన జరగాలి. పెత్తం దారీ వ్యవస్థకు చోటు లేదు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఆశాస్త్రీ యంగా జరిగినల్లాల విభజనను సవరించాం. ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగు నింపాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నాం. సామా జిక బాధ్యతగానే ప్రతీ నెలా 1వ తేదీన కనీస అవసరాలు తీర్చుకో లేని ఆపన్నులకు పెన్షన్ అందిస్తున్నాం. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు సహా 28 కేటగిరీల లబ్దిదారులకు పెన్షన్లు అందిస్తూ వారిని ఆదుకుంటున్నాం. పేదల జీవన ప్రమాణాలను పెంచాలనే లక్ష్యంతో పీ4 కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నాం. ఇప్పటి వరకూ రూ.68,598 కోట్ల మేర పెన్షన్ల కింద కూటమి ప్రభుత్వం పంపిణీ చేసింది. ప్రతీ నెలా 62.20 లక్షల మందికి రూ.2,712 కోట్లు పెన్షన్లకు చెల్లిస్తున్నాం.' అని సీఎం అన్నారు.

**పొదుపు ఉద్యమానికి డ్వాక్రా మహిళలే దిక్సూచి**

గడిచిన రెండేళ్ల ప్రయాణంలో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయటం తో పాటు వ్యవస్థలను గాడిలో పెట్టామని, సంక్షోభాలు, సమస్య లను దాటుకుని ప్రజలకు మేలు చేసేలా అనునిత్యం పనిచేస్తున్నా మని అన్నారు. 'గత పాలకులు ఐదేళ్ల పాటు విధ్వంసం చేశారు... రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. రెండేళ్లలోనే అన్ని పనులూ చేసేశామని మేం చెప్పటం లేదు. కానీ శుభారంభం చేశాం. గత అవినీతి పాలనను మార్చి రాష్ట్రంలో మళ్లీ సుపరిపాలన తీసుకు వచ్చాం. మనమిత్ర వాట్సప్ గవర్నెన్సు ద్వారా ఆన్‌లైన్‌లో సేవలను అందిస్తూ ప్రజల చేతిలోకి పౌర సేవలను తీసుకు వచ్చాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సంక్షేమ, అభివృద్ధి పథకా లను ప్రజలకు అందించగలుగుతున్నాం. తల్లికి వందనం, స్త్రీశక్తి, దివ్యాంగ శక్తి, మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో లాంటి వివిధ పథకాలను అమలు చేశాం. పేదల జీవన ప్రమాణాలు పెంచి వారికి అండగా నిలవాలనేది కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం. సంపన్నులైన 10 శాతం మంది అట్టడుగు స్థాయిలో ఉ న్న 20 శాతం మంది పేదలను ఆదుకునేలా పీ4 కార్యక్రమం చేపట్టాం. ఆర్థిక అసమానతలు తొలగించి మెరుగైన జీవన ప్రమా ణాలు కల్పించేందుకు నా జీవితాన్ని అంకితం చేశాను. లక్ష మందికి పైగా మార్గదర్శులు, 10 లక్షలకు మందికి పైగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని అన్ని విధాలా సహకారం అందిస్తు న్నారు. మహిళలను పారిశ్రామిక, వ్యాపార వేత్తలుగా తయారు చేసేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. పొదుపు ఉద్యమంలో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శంగా నిలిచారు. అందుకే బ్యాంకులు కూడా డ్వాక్రా మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు అందించేందుకు ముందుకు వస్తున్నాయి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**డ్వాక్రా మహిళలకు అభినందన**

అనంతరం ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల మహిళలు ప్రదర్శించిన అధునాతన కుట్టు మిషన్లను సీఎం తిలకించారు. ఆధునిక కుట్టు మిషన్‌తో సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని అప్పటికప్పుడే తయారు చేసిన మహిళలు దానిని ముఖ్యమంత్రికి అందించారు. అరటి నారతో తయారు చేసిన వివిధ ఉత్పత్తులను చూసిన సీఎం డ్వాక్రా సంఘాల మహిళలను అభినందించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న ఉద్యాన పంటల ఉత్పత్తులు, మత్స్యకార బోట్లకు బిగించే ట్రాన్స్ పాండర్లను సీఎం పరిశీలించారు. ఈ కార్యక్రమం లో మంత్రులు పి.నారాయణ, ఎన్ఎండీ ఫరూఖ్, ఆనం రామ నారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే సునీల్ కుమార్, జిల్లా కలెక్టర్ హిమాన్షూ శుక్లా తదితరులు హాజర య్యారు.


# కుప్పంలో జూలై 3-5 వరకు మూడు రోజులు పర్యటించనున్న ముఖ్యమంత్రి

**- అభివృద్ధి సహా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొననున్న సీఎం చంద్రబాబు - రూ.3847 కోట్ల విలువైన పెట్టుబడులకు శంకుస్థాపనలు చేయనున్న ముఖ్యమంత్రి - సీఎం సమక్షంలో రూ.1026 కోట్ల విలువైన పెట్టుబడులకు ఎంఓయూలు - ఎంఎస్ఎంఇ పార్క్, కడా గెస్ట్ హౌస్ ప్రారంభం, కుప్పం బస్టాండ్, డిపో నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు - దాదాపు ఏడాదిన్నర తర్వాత కుప్పం టీడీపీ కార్యాలయాన్ని సందర్శించనున్న ముఖ్యమంత్రి**

**కుప్పం, (రాజధాని వార్తలు):** ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ఒప్పందాలు, పార్టీ కార్యక్రమాలు, క్షేత్ర స్థాయి పర్యటనలు. ఇదీ మూడు రోజుల పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు షెడ్యూల్. జూలై 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు...పార్టీ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు హాజరు కాను న్నారు. అధికారిక కార్యక్రమాలతోపాటు.. పార్టీ కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ సీఎం చంద్రబాబు మూడు రోజుల పర్యటన సాగనుంది. ఈ పర్యటనలో భాగంగా తొలి రోజు గుడిపల్లె మం డలం పొగురుపల్లెలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మొత్తం గా రూ.3,847 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టే 12 పరిశ్రమ లకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ కంపెనీల ద్వారా మొత్తంగా 23 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. దీంతో పాటు మరో రూ.1026 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి కుప్పంలో పరిశ్రమలు ఏర్పాటు చేసే వివిధ కంపె నీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమక్షంలో అధికారులు ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. వీటితో పాటు పలు ప్రారంభో త్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టనున్నారు. అబీస్ ప్రోటీన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ ను ప్రారంభించి 200 మందికి ఉద్యోగ నియామక పత్రాలను సీఎం అందించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రూఫ్ టాప్ సోలార్ నిమిత్తం ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్లను ప్రారంభిస్తారు. అలాగే పీఎంఏవై పథకం కింద నిర్మించిన 5,179 ఇళ్లను లబ్దిదారులకు అందచేస్తారు. అలాగే కుప్పంలో మరిన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసే నిమిత్తం పలువురు పారిశ్రామికవేత్తలతో సీఎం సమావేశం అవుతారు. స్థానికులను ఉద్దేశించి పొగురుపల్లెలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం పాల్గొంటారు.

**క్షేత్ర స్థాయి పర్యటనలు... వివిధ ప్రాంతాల సందర్శనలు**

ఇక రెండో రోజున శెట్టిపల్లి, గుట్టాలపల్లి, కంగుంది గ్రామాలతో పాటు కుప్పం మున్సిపాల్టీలో సీఎం చంద్రబాబు పర్యటిస్తారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనల్లో భాగంగా 44.58 ఎకరాల్లో 167




ఇండస్ట్రియల్ ప్లాట్లతో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఇ పార్క్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.

అలాగే కడా గెస్ట్ హౌస్ ప్రారంభించడంతోపాటు.. కుప్పం బస్టాండ్, డిపో నిర్మాణాలకు శంకుస్థాపనలు చేపట్టనున్నారు. శెట్టిపల్లిలోని నెట్ జీరో విధానాన్ని అనుసరిస్తున్న ఇళ్లను పరిశీలిస్తారు. కుప్పం ఏరియా ఆస్పత్రిని సందర్శించి.. ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటి.. ఏరియా ఆస్ప త్రిలో సీటీ స్కానింగ్, డయాలసిస్ సెంటర్లను ప్రారంభించను న్నారు. అలాగే కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి ముఖ్యమంత్రి వెళ్లనున్నారు. దాదాపు ఏడాదిన్నర క్రితం కుప్పం కార్యాలయాన్ని సందర్శించిన సీఎం.. సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ పార్టీ కార్యాలయానికి వెళ్లి..జన నాయకుడు పేరుతో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొం టారు. కంగుంది గ్రామంలో నిరుపేదలకు అసైన్మెంట్ పట్టాలను అందిస్తారు. అలాగే కుప్పం మాస్టర్ ప్లాన్, స్వర్ణ కుప్పం విజన్ -2029 డాక్యుమెంట్ రూపకల్పనపై అధికారులతోనూ ఐఐటీ కాన్పూర్ ప్రతినిధులతో చర్చిస్తారు. కుప్పం స్థానిక నేతలతో సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. రెండో రోజున కుప్పం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

**కుప్పం టీడీపీ సంస్థాగత వ్యవహారాలపై సమీక్ష**

కుప్పంలో మూడో రోజు పర్యటనలో పార్టీ కార్యక్రమాలతో పాటు.. శాంతిపురం, గుడిపల్లె మండలంలో వివిధ క్షేత్ర స్థాయి పర్యటనలు చేపట్టనున్నారు. కుప్పంలోని ముఖ్యనేతలు మొదలుకొని బూత్ స్థాయి కార్యకర్తలతో సీఎం చంద్రబాబు భేటీ అవుతారు. కుప్పం నియోజకవర్గంలోని పార్టీ సంస్థాగత వ్యవహారాలపై స్థానిక నేతల నుంచి అభిప్రాయాలు తీసుకుం టారు.

అలాగే పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు... ఏఐ వంటి అంశాలపై నేతలకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తారు. అలాగే పీ4 కార్యక్రమంలో భాగంగా పలువురు బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో సీఎం చంద్రబాబు సమావేశమ వుతారు. పీ4 కార్యక్రమం అమలుపై చర్చిస్తారు. అలాగే పర్యావరణానికి హాని కలిగించకుండా ఏర్పాటు చేసిన పౌల్ట్రీ షెడ్లను సీఎం సందర్శిస్తారు. ఆదర్శ రైతులను పలకరిస్తారు.. వారితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. ద్రవిడ యూనివర్శిటీ మీటింగ్ హాల్లో చిత్తూరు జిల్లా అధికారులు, కుప్పం నియోజకవర్గంలో విధులు నిర్వహించే ఉద్యోగులతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు. ఈ కార్యక్రమంతో కుప్పంలో ముఖ్యమంత్రి మూడు రోజుల పర్యటన ముగుస్తుంది.

# మహిమా రాజ్‌పుత్: అంతర్జాతీయ అంతరిక్ష మిషన్ 'శక్తిశాట్' కు ఎంపికైన చత్తీస్‌గఢ్‌కు చెందిన 14 ఏళ్ల విద్యార్థిని



చత్తీస్‌గఢ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని మహిమా రాజ్‌పుత్, కేవలం 14 ఏళ్ల వయస్సులోనే ఒక అద్భుతమైన మైలురాయిని అధిగమించింది. 108 దేశాలకు చెందిన యువ ఆవిష్కర్తలను ఒకచోటకు చేర్చే అంతర్జాతీయ విద్యార్థుల అంతరిక్ష మిషన్ 'శక్తిశాట్' లో ఆమె స్థానాన్ని సంపాదించుకుంది. ఆమె ఎంపిక కేవలం విద్యాపరమైన ప్రతిభనే కాకుండా, అంతరిక్ష విజ్ఞానం, ఉపగ్రహ సాంకేతికతపై ఆమెకు పెరుగుతున్న అభిరుచిని ప్రతిబింబిస్తోంది. భారతదేశం తన తరువాతి తరం శాస్త్రవేత్తలను, ఇంజనీర్లను ప్రోత్సహిస్తున్న తరుణంలో, దేశంలోని ప్రతి మూల నుండి వచ్చే ప్రతిభ అంతర్జాతీయ స్థాయికి ఎలా చేరుకోగలదో చెప్పడానికి మహిమ ప్రయాణం ఒక స్ఫూర్తిదాయకమైన ఉదా హరణగా నిలుస్తుంది. అంతరిక్ష పరిశోధనల భవిష్యత్తును తీర్చి దిద్దేందుకు ఆసక్తి చూపే విద్యార్థులకు లభిస్తున్న విస్తృత అవకా శాలకు, పట్టుదలకు , జిజ్ఞాసకు ఆమె సాధించిన విజయం ఒక నిదర్శనం. ఒక నిజమైన ఉపగ్రహ మిషన్ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తన తోటి విద్యార్థులతో కలిసి పని చేయడం ద్వారా, ఆమె ఒక విలువైన అనుభవాన్ని పొందుతోంది. ఇది సైన్స్, టెక్నాలజీ, అంతరిక్ష పరిశోధన రంగాలలో తమ కెరీర్‌ను ఎంచుకునేలా మరింత మంది యువ విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు స్ఫూర్తిని నింపడంలో సహాయపడుతుంది.

# మావిగన్ దెబ్బకు 11 సీట్లు కూడా పోవడం ఖాయం : మంత్రి కొలుసు పార్థసారధి



**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధ్యక్షులు, పులివెందుల శాసనసభ్యులు, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మావిగన్ ఎజెండాతో 2029 ఎన్నికలకు వెళతాం అని చేసిన ప్రకటనతో ఈ రాష్ట్రానికి పట్టిన 11వ నంబర్ దరిద్రం పోవడం ఖాయం. 2019-24 మధ్య 3 రాజధానులు అంటూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్మోహన్ రెడ్డికి 151 నుండి 11సీట్లకు చతికిలపడినా ఇంకా తత్వం బోధపడలేదు. 2029లో తనకు అధికారం వస్తే మరోసారి రాష్ట్ర రాజధాని భవిష్యత్తుతో చెలగాటమాడతానని, రైతుల త్యాగాలను అపహాస్యం చేస్తానని, ఇప్పటి వరకు రాజధానిలో జరిగిన పనులన్నింటినీ జేసీబీతో కుప్పకూల్చడం ఖాయం అని జగన్ చెప్పకనే చెప్పారు. ఎన్నో పవిత్రస్థలాల నుండి పవిత్ర జలాలు, మట్టితో శంకుస్థాపన చేసిన ఐదుకోట్ల ఆంధ్రుల రాజధాని అమరావతితో చెలగాటమాడిన జగన్‌కు బుద్ధి చెప్పిన రాష్ట్ర ప్రజలు, ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే 11 నుండి 1 సంఖ్యకు పరిమితం చేయడం తథ్యం. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో రాజధాని అంటున్న జగన్మోహన్ రెడ్డికి అసలు రాజధాని పరిధి ఎక్కడివరకు విస్తరించి ఉందో కనీస అవగాహన కూడా లేదని ఈరోజు మరోసారి స్పష్టం చేశాడు. ప్రస్తుతం రాజధాని పరిధి మచిలీపట్నం పార్లమెంటు, విజయవాడ పార్లమెంటు, గుంటూరు పార్లమెంటుల మధ్య కేంద్రీకృతమైంది. కనీసం ఈ విషయంపై కూడా జగన్‌కి అవగాహన లేకుండా మావిగన్ అని చెప్పడం అంటే పూర్తిగా అవివేకం కాక మరొకటి కానేకాదు. అమరావతికి చట్టబద్ధత లభించినా, గెజిట్ విడుదలైనప్పటికీ జగన్ అమరావతిని నాశనం చేయడమే తన పంతంగా పెట్టుకున్నాడని తేటతెల్లమైంది. మావిగన్ 2029 సార్వత్రిక ఎన్నికల వరకు కాదు, త్వరలోనే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దెబ్బకే తుప్పుపట్టి విరిగిపోవడం ఖాయం. మాటతప్పడం, మడమను 360డిగ్రీల కోణంలో తిప్పడం జగన్మోహన్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. 2029 ఎన్నికలు వచ్చేనాటికి జగన్ తన మావిగన్ ప్రతిపాదనను మార్చేసి మరో ప్రతిపాదనతో రాష్ట్ర ప్రజలను పూర్తిగా పక్కదోవ పట్టించడానికి సిద్ధంగా ఉన్నాడు. మొదట అమరావతే రాజధాని అన్నాడు, తర్వాత 3రాజధానులు అన్నాడు, నేడు మావిగన్ అంటున్నాడు, ఆ తర్వాత ఏ గన్ తెస్తారోనని రాష్ట్ర ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ఐదుకోట్ల ఆంధ్రుల కలల రాజధానికి కులాలను అంటగట్టి కుప్పకూల్చే కుతంత్రాలు చేయడం జగన్మోహన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. దేవతల రాజధాని అమరావతి జోలికి ఎవరు వచ్చినా, చెడగొట్టాలని చూసినా ఫలితం అనుభవించక తప్పదు. రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరగడం చూసి జగన్ కి నిద్రపట్టడం లేదు. 2029లో అధికారంలోకి వస్తామని, మావిగన్‌తో అమరావతిని కూల్చేస్తామని ఉత్తరకుమార ప్రగల్భాలు పలకడం శోచనీయం. జగన్ అధికారంలోకి రావడం కాదు, ప్రస్తుతం ఉన్న 11సీట్లు కుప్పకూలకుండా నిలబెట్టుకుంటే గొప్పే. జగన్మోహన్ రెడ్డి పరిపాలన విధ్వంసపూరితమని, కూటమి ప్రభుత్వ పాలన వికాసం వైపు దూసుకెళుతోందని రాష్ట్ర ప్రజలు గ్రహించారు, నమ్ముతున్నారు. ఈ నమ్మకాన్ని జగన్ ఎన్ని కుయుక్తులు పన్నినా దెబ్బతీయలేరు.

# విద్యా శాఖ మంత్రిగా లోకేశ్ పనితీరుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు





**అనంతపురం, (రాజధాని వార్తలు):** ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. విద్యా శాఖ మంత్రిగా దేశానికే ఆదర్శంగా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కృషి చేస్తూ, ఎన్నో సంస్కరణలు విజయవంతంగా అమలు చేస్తున్న లోకేశ్‌ను రాష్ట్రపతి అభినందించారు. ఈ సంస్కరణలు కొనసాగాలని సూచించారు. బుధవారం అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి హాజరై తిరిగి వెళుతున్నప్పుడు రాష్ట్రపతికి వీడ్కోలు పలికేందుకు హెలికాప్టర్ వరకు మంత్రి లోకేశ్ వెళ్లారు. తన దగ్గరకు మంత్రిని పిలిచిన రాష్ట్రపతి.. ఏపీలో విద్యాసంస్కరణలు, విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులు చాలా బాగున్నాయని అభినందించారు. వీటిని కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు కేంద్రంగా సాగుతున్న విద్యా వ్యవస్థలో మార్పులు వారి బంగారు భవిష్యత్తుకు మార్గం వేస్తాయని రాష్ట్రపతి అన్నారు. స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ ప్రసంగం స్ఫూర్తివం తంగా సాగిందని అభినందించారు. సభకు హాజరైన గ్రాడ్యుయేట్స్‌కు మంచి సందేశం ఇచ్చారని లోకేశ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు.

# అసంపూర్తిగా పదవీ విరమణ చేయడం బాధాకరం

**- యనమల నారాయణ, నారాయణరెడ్డిలు రైతులకు చేసిన సేవలు మెరుగైనవి**

**- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభిరామిరెడ్డి, కోటేశ్వరరావు**



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు నంబర్-24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో సేవలందించి, ముఖ్య కార్యనిర్వాహక అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన యనమల నారాయణ, నారాయణరెడ్డిలు అసంపూర్తిగా పదవీ విరమణ చేయడం బాధాకరమని తిరుపతి పార్లమెంటు జిల్లా తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చిల్లకూరు పట్టాభి రామిరెడ్డి, బీజేఎంఎస్ రాష్ట్ర నాయకులు పల్లి కోటేశ్వరరావులు అన్నారు. మంగళవారం గూడూరు నంబర్-24 ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన యనమల నారాయణ, నారాయణరెడ్డిలు పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో వారు పాల్గొని మాట్లాడారు. సంఘ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి యనమల నారాయణ, నారాయణరెడ్డిలు అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఉద్యోగ జీవితమంతా నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహించి సహచర ఉద్యోగులు, రైతుల అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల పూర్తి స్థాయి ప్రయోజనాలు పొందకుండానే వారు పదవీ విరమణ చేయాల్సి రావడం విచారకరమని పేర్కొన్నారు. అయినప్పటికీ ఆయన సేవలు సహకార రంగ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, సంఘ సభ్యులు, అభిమానులు, శ్రేయోభిలాషులు మాట్లాడుతూ యనమల నారాయణ, నారాయణలను సేవలను గుర్తు చేసుకున్నారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, సంఘ అభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డారని ప్రశంసించారు. పిఎసిఎస్ చైర్మన్ కరుణాకర్ రెడ్డి యనమల నారాయణ, నారాయణ రెడ్డిలను పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆయనకు రావలసిన బకాయిలు, ఇతర ఉద్యోగ సంబంధిత ప్రయోజనాలు త్వరితగతిన అందేలా సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పదవీ విరమణ సందర్భంగా యనమల నారాయణ, నారాయణ రెడ్డిలు భావోద్వేగానికి గురయ్యారు. తమ ఉద్యోగ జీవి తంలో సహకరించిన సహచర ఉద్యోగులు, సంఘ సభ్యులు, రైతులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జీవితాంతం రైతు సేవకు అంకితభావంతో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు పిఎస్ఎస్ చైర్మన్ కొండా రామచంద్రారెడ్డి, సంఘ డైరెక్టర్లు దువ్వూరు రవీంద్ర రెడ్డి బచ్చ రవీందర్ రెడ్డిలతోపాటు గూడూరు టిడిపి పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, మాజీ డైరెక్టర్లు ఇందుకూరు జనార్దన్ రెడ్డి, బాబు రెడ్డి, దేగపూడి కృష్ణారెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు ఉద్యోగులు, రైతులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని యనమల నారాయణ, నారాయణరెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం పున్నపువారిపాలెం గ్రామంలో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొని ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లిన సీఎం చంద్రబాబు పద్మమ్మకు వితంతు పింఛను రూ.4 వేలు, దివ్యాంగురాలు తులశమ్మకు రూ.15,000 అందించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో సమావేశమై ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

# ప్రతి ఇంటిని బిఎల్ఓలు తప్పనిసరిగా సందర్శించాల్సిందే...

**- సర్ ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే పురోగతిపై మంగళవారం ఉదయం ఇన్చార్జి డి.ఆర్.వో వై.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మిలతో కలసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మండల స్థాయి బూత్ లెవల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతి మండలంలో ఇప్పటివరకు ఎన్ని (సర్) ఫారాలు సేకరించారు, ఇంకా ఎన్ని ఫారాలు మిగిలి ఉన్నాయో, ఇంటింటి సర్వే పురోగతి ఎలా ఉందో మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువులోగా సర్వేను పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఓటరికి సంబంధించిన వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించాలని, ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత ఫారాలను 15 రోజులలోగా పూర్తి చేయాలని దీూలకు కలెక్టర్ ఆదేశించారు. సందేహాలు తలెత్తిన సందర్భాల్లో వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. (సర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇన్చార్జ్ డి.ఆర్.వో వై.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి మరియు ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, మండల స్థాయి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదాయ సమీకరణపై సీరియస్‌గా ఫోకస్ పెట్టండి.. అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. హెచ్ఎండిఏ, టిజిఐఐసి, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు. బుధవారం ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీ కరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఛేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా బడ్జెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు. ఊహాజనిత బడ్జెట్ కాదని.. వాస్తవికత ఆధారంగానే బడ్జెట్‌ను రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జనసేన తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జి ఎమ్మెల్యే లోకం మాధవిని మర్యాదపూర్వకంగా కలిసిన కోటా చంద్రబాబు




**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జి ఎమ్మెల్యే లోకం మాధవిని శ్రీకాళహస్తి మాజీ నియోజకవర్గం ఇంచార్జి వినుత కోటా భర్త కోటా చంద్రబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా నూతనంగా నియమితులైన జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కార్యక్రమం తిరుపతిలో రెండవ రోజు కూడా దరఖా స్తుల స్వీకరణ కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ తిరుపతి పార్ల మెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన ఎమ్మెల్యే లోకం మాధవిని, శ్రీకా ళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కోటా చంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిసి కలంకారి శాలువాతో ఘనంగా సత్కరించారు. జనసేన పార్టీ మాజీ ఇంచార్జ్ వినుత కోటా తల్లి, మాజీ ఎంపీటీసీ నగరం జయలలితని తిరుపతి పార్లమెంట్ సమాచార సేకరణ కమిటీ సభ్యురాలిగా అధినేత పవన్ కళ్యాణ్ నియమించారన్నారు. ఈ సందర్భంగా నగరం జయలలిత ఎమ్మెల్యే లోకం మాధవితో కలిసి తిరుపతిలో నిర్వహించిన సమాచార సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో చంద్రబాబు కోటా మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాల సాధన కోసం చేపట్టిన సమాచార సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. పార్టీ నిర్మాణాన్ని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే ఈ కార్యక్రమంలో ప్రతి జనసైనికుడు, నాయకుడు చురుకుగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీనాయకులు, జనసైనికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

## - అర్జీల పరిష్కారం నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి - ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత - పీజీఆర్ఎస్‌కు, రెవెన్యూ క్లినిక్‌కు వినతులు 278 అర్జీలు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** పీజీఆర్ఎస్ అర్జీలను నిర్లక్ష్యం చేయ కుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో ప్రజా పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, ఇంచార్జ్ డిఆర్ఓ వై.శ్రీనివాస్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రెవిన్యూ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఏడి సర్వే, ఇరిగేషన్, జీవీఎంసీ, ఏడి అగ్రికల్చర్, మైనింగ్, ట్రైబల్ వెల్ఫేర్, లేబర్ ఆఫీస్, ఫిషరీస్, ఏపీఎస్ఆర్టీసీ, డ్వామ, తాగునీరు తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ఆలస్యం చేయ కుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీలను కేవలం సమస్యలను పరిష్కరించడవే ముఖ్యం కాదని, ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, గడువు ముగియక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖలలో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ అమలు పనితీరుని శాఖల వారిగా కలెక్టర్ సమీక్షించారు. ఈ-ఆఫీస్ తప్పనిసరిగా అమలు చేయాలని, సిబ్బంది అందరికి లాగిన్ ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వాట్సాప్ గవర్నన్స్‌పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఫిర్యాదులను తిరస్కరించాల్సి వస్తే, దానికి సరైన కారణాలను తెలియజేస్తూ ఫిర్యాదుదారునికి లిఖితపూర్వక సమాచారం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పెండింగ్ అర్జీలు అధికంగా ఉన్న శాఖల అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేస్తూ, సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 131 అర్జీలు అందాయి. అదేవిధంగా రెవెన్యూ క్లినిక్ కు 147 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఈవీఎం గోడౌన్ వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

## - వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఈవీఎం గోడౌన్ వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ సిబ్బందిని ఆదేశించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోడౌన్ ను తనిఖీల్లో భాగంగా సోమవారం ఉదయం రెవిన్యూ డివిజనల్ అధికారి ఆయేషాతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. తాళాలు తీయించి గోడౌన్ లోపల భాగంలో కూడా పర్యటించారు. అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీ క్రమంలో లాగ్ బుక్‌లో సంతకం చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై నేతలతో మాట్లాడారు.

భద్రపరిచిన ఈవీఎంల స్థితిగతులను జాయింట్ కలెక్టర్‌కు ఎన్నికల విభాగం అధికారులు వివరించారు. ఈ కార్య క్రమంలో అనకాపల్లి ఆర్డీవో ఆయేషా, ఎలక్షన్ సెల్ సూపరిం టెండెంట్ వాసు నాయుడు, టిడిపి నుండి బి శ్రీనివాసరావు, ఏఏపి నుండి కే.హరినాథ్ బాబు, జేఎస్పీ నుండి డి.వేణుగో పాలకృష్ణ,



స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది తదితరులు



పాల్గొన్నారు.

# రూ.50 లక్షలతో 'చెరీ చెరువు' సుందరీకరణ పనులకు ఘనంగా శంకుస్థాపన

## - ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి శంకుస్థాపన చేసిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** "ప్రతి పొలానికి నీరు" అనే నినాదంతో నీటిపారుదల ద్వారా సాగు విస్తీర్ణాన్ని పెంచడం, నీటి వృధాను తగ్గించి, నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపు నిచ్చారు. సోమవారం ఉదయం కశింకోట మండలం బయ్యవరం గ్రామంలో రూ. 50.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న "చెరీ చెరువు" సుందరీ కరణ పనులకు సంబంధించి శిలాఫల కాన్ని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణతో కలిసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ శాస్త్రోక్తంగా ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో WDCP-PMKSY 2.0 పథకం కింద ఈ నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ పరిధిలో ఉన్న చెరీ చెరువును ఆధునీకరించి, పునరుద్ధరించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకోవచ్చున్నారు. ఈ పునరుద్ధరణ పనుల వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందడమే కాకుండా, స్థానిక రైతులకు సాగునీరు మరియు పశువులకు తాగునీరు పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ



మాట్లాడుతూ WDCP-PMKSY 2.0 ద్వారా చెరువుల పునరుద్ధరణ చేపట్టి, కరవు పీడిత ప్రాంతాల రూపురేఖలను మార్చడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మండల పరిషత్ అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంక్షేమ వసతి గృహాల్లో అంటువ్యాధుల నివారణకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీలు

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, ఇతర నివాస సంస్థల్లో అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లా పరిపాలన జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీలను (జెఐసి) ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఈ కమిటీల్లో పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ పరిపాలన, వైద్య ఆరోగ్య శాఖ, ఆహార భద్రత (ఎఫ్ఎస్ఎస్ఏఐ), పశుసంవర్ధక, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. కమిటీలు సంక్షేమ వసతి గృహాలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి పారిశుద్ధ్యం, తాగునీటి నాణ్యత, ఆహార భద్రత, పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థులు, నివాసితుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే లోపాలను వెంటనే గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే ఇంటర్-రాపిడ్ రెస్పాన్స్



టీమ్స్ (ఐఆర్ఆర్‌టిఎస్)ను రంగంలోకి దించి తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు.

# తల్లి జ్ఞాపకార్థం గ్రామానికి ఆరు సిమెంట్ బల్లలు విరాళం

**కరప, (రాజధాని వార్తలు):** తల్లి జ్ఞాపకార్థం గ్రామ ప్రజల సౌకర్యార్థం ఆరు సిమెంట్ బల్లలు విరాళంగా అందించి సేవాభావాన్ని చాటుకున్నారు. కరప గ్రామానికి చెందిన, ప్రస్తుతం కాజులూరు ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వ హిస్తున్న చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి చింతా నారాయణమూర్తి. తన మాతృమూర్తి చింతా చంద్రావతి స్మారకార్థం తండ్రి చింతా సత్యనారాయణతో కలిసి సుమారు రూ.20 వేల వ్యయంతో గ్రామంలోని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఎదురుగా ఉన్న బస్ స్టాప్‌తో పాటు పల్లపు వీధి రామాలయం, సీతమ్మ పోటు రామాలయం వద్ద ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు ఆరు సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు.

చింతా నారాయణమూర్తిని ఆద ర్శంగా తీసుకుని గ్రామా నికి చెందిన ఉద్యోగులు, ప్రవాసులు కూడా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాయుడు జగన్నాథం, మాజీ సర్పంచ్ వాసంశెట్టి రామారావు, రెడ్డి వీరభద్రరావు, చోడపునీడి రాంబాబు, కాకి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## 'అయోధ్య' అవినీతికి జవాబుదారీ ఎవరు?

బాబ్రీ మసీదు కట్టడాన్ని కూల్చివేసిన రోజు (డిసెంబర్ 6, 1992) ముందు రాత్రి అయోధ్యలో సీనియర్ ఆర్ఎస్ఎస్ సభ్యుడు, జర్నలిస్టు, రామజన్మ భూమి ఉద్యమం సమయంలో మీడియా వ్యవహారాలను పర్యవేక్షించిన రమా శంకర్ అగ్నిహోత్రిని కలుసుకున్నాను. ఆయన పక్కనే ఉన్న ఫైజాబాద్ (అయోధ్య) ఎంపీ వినయ్ కతియార్ నాకు కరసేవ గురించి సమాచారం ఇచ్చారు. భజరంగ్‌దళ్ వ్యవస్థాపక అధ్యక్షుడుగా ఆయన రామ జన్మభూమి ఉద్యమాన్ని తీవ్రతరం చేసిన వారిలో ఒకరు. అశోక్ సింఘాల్, వినయ్ కతియార్, కల్యాణ్ సింగ్, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గురువు మహంత్ వైద్యనాథ్, ఉమాభారతి, సాధ్వి రితంభర వంటి నేతలు లేకపోతే రామజన్మభూమి ఉద్యమమే లేదు. రామ్ రథయాత్ర పేరిట ప్రజల్లోకి వెళ్లిన అడ్వాణీ ఈ ఉద్యమానికి రాజకీయ రూపమే కాని, అసలు ఉద్యమం నిర్వహించిన వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ వంటి శక్తులు వేరు. అయోధ్య నుంచి మూడుసార్లు గెలిచిన వినయ్ కతియార్ 'మందిర్ వహీ బనాయేంగే' వంటి నినాదాలతో ప్రాచుర్యం పొందారు. అలాంటి వినయ్ కతియార్ ఇవాళ అయోధ్యలో జరుగుతున్న పరిణామాలను తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఆలయంలో ఉన్న హుండీల నుంచి భారీ ఎత్తున నగదు, ఆభరణాలను దోచుకోవడంపై ఆయన తీవ్ర మనస్తాపం ప్రకటించారు. 'ప్రస్తుతం ఉన్నవారందరూ దొంగలే' అని ఆయన అన్నారంటేనే పరిస్థితి తీవ్రత మనకు అర్థమవుతుంది. వినయ్ కతియార్ మాత్రమే కాదు, అనేకమంది సాధువులు కూడా ఈ దోపిడీని ఖండించారు. 'నిధులు దోచుకున్నవారు రావణులు' అని భాగేశ్వర్‌ధామ్ అధినేత ధీరేంద్ర కృష్ణశాస్త్రి అన్నారు. స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి, ప్రవచనకర్త దేవకీనందన్ ఠాకూర్, మహంత్ కమల్‌నయన్ దాస్ వంటి సాధువులు ఎందరో ఈ దోపిడీ వెనుక శక్తిమంతులు ఉన్నారని ఆరోపించారు. 'ఈ విషయంలో నేను నిజం చెపితే సమస్యల్లో పడతాను' అని బీజేపీ మాజీ ఎంపీ ఒకరు అన్నారు. ఆలయ నిర్మాణం, ఆస్తుల నిర్వహణ, ప్రజల విరాళాలను నిర్వహించేందుకు 2020లో కేంద్ర ప్రభుత్వం శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఏర్పాటు చేసినప్పటి నుంచే ఈ నిధులను కొల్లగొడుతున్నారని, భక్తులు సమర్పించిన బంగారం, వెండి, నగలపై ఎవరూ సరిగా లెక్కలు రాయలేదని ట్రస్టు మాజీ సీఈఓ మహిపాల్‌సింగ్ ఆరోపించారు. ఓచర్లకూ, నగదు, నగలకు మధ్య పొంతన లేదని ఆయన ఎత్తి చూపిన తర్వాత దర్యాప్తు చేసేందుకు బదులు ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. 2026 జూన్ 7న ఈ విషయం సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ ప్రస్తావించి, న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేసిన తర్వాతే అయోధ్య విరాళాల బాగోతం బయటకు పొక్కింది. బ్యాంకు ఖాతాలు, ట్రస్టు ఖాతాలను ప్రజలకు చూపించి పారదర్శకంగా వెల్లడించాలని బీజేపీ నేత రజనీష్‌సింగ్ నేరుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. ఎట్టకేలకు జూన్ 13న ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను నియమించింది. అయోధ్యలో రామజన్మభూమి కోసం భక్తులు ఎంత పెద్ద సంఖ్యలో విరాళాలు, ఆభరణాలు, బంగారం, వెండి ఇటుకలు సమర్పించారో లెక్క తెలియదు. అక్షింతల పంపిణీ పేరిట, 'రామ్ రామ్ గ్రామ్ అభియాన్' పేరిట నిర్వహించిన కార్యక్రమాలకు అనేకమంది భక్తులు తాదాత్మ్యంతో ప్రతిస్పందించారు. సీసీటీవీ కెమెరాల్లో కనీసం 70సార్లు నగదు తీసుకువెళుతున్నట్లు, మూటలు మోసుకెళుతున్నట్లు దృశ్యాలు బహిర్గతమయ్యాయి. సిబ్బంది కొందరు కావాలనే కెమెరాలకు అడ్డుగా నిలుచుని హుండీల నుంచి నగదు కాజేసే దృశ్యాలు రికార్డు కాకుండా చేశారని సిట్ తేల్చింది. దోచుకున్న డబ్బుతో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారన్న సమాచారం కూడా లభించింది. సిట్ అరెస్టు చేసిన వారిలో నోట్లు లెక్కపెట్టే కొందరు అధికారులు, ట్రస్టు ప్రధాన కార్యదర్శి, వీహెచ్‌పీ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు చంపత్‌రాయ్ బన్సల్, ఆయన వ్యక్తిగత డ్రైవర్ రమాశంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ యాదవ్ తదితరులు ఉన్నారు. కానీ బాధ్యత వహించాల్సిన చంపత్ రాయ్ బన్సల్, ట్రస్టీ అనిల్ మిశ్రాలు కేవలం రాజీనామాలు చేశారు. అనిల్ మిశ్రా అయోధ్యలో అధునాతన సౌకర్యాలతో మూడంతస్తుల బ్రహ్మాండమైన బంగళాను నిర్మించుకున్నారని వార్తలు వచ్చాయి. నిజానికి అయోధ్యలో కోట్ల రూపాయల రియల్ ఎస్టేట్ వ్యవహారాలు నడిపిన అలోక్ బన్సల్, ఆయన సతీమణి శివానీ బన్సల్, చందన్ రాయ్ బన్సల్, మనీష్ బన్సల్ తదితరులు చంపత్ రాయ్ బంధువర్గీయులే, సిట్ స్వాధీనం చేసుకున్న అనేక భూమి కొనుగోళ్ల పత్రాలు మీడియాకు చేరాయి. మహారాష్ట్రకు చెందిన కర్ణాటక ప్రాంత ప్రచారక్, వీహెచ్‌పీ కేంద్ర జాయింట్ సెక్రటరీ గోపాల్‌రావును పరిపాలనా అధికారిగా నియమించింది. చంపత్ రాయ్ తర్వాత అత్యంత శక్తిమంతుడైన గోపాల్‌రావు అయోధ్యలో అనేక ఉడుపి హోటల్స్ సృష్టికర్త అని కూడా సమాచారం. రామమందిర ఉద్యమం అనేదే లేకపోతే భారతీయ జనతా పార్టీయే లేదు అన్నది పూర్తిగా సత్యదూరం కాదు. బీజేపీ ఉత్థానంలో రామజన్మభూమి పాత్ర ఉన్నదన్న విషయం లాల్‌కృష్ణ అడ్వాణీయే తన జీవిత చరిత్రలో వివరించారు. రామజన్మభూమి ఉద్యమాన్ని స్వతంత్ర భారత చరిత్రలో అతి పెద్ద ప్రజా ఉద్యమంగా ఆయన అభివర్ణించారు. సోమనాథ్ నుంచి ఆయన రథయాత్ర జరిపిన తర్వాతే 1991 ఎన్నికల్లో బీజేపీకి 120 సీట్లు లభించాయి. 1998లో బీజేపీ ఎన్నికల ప్రణాళికలో రామమందిరం గురించి వాగ్దానం చేసింది. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలో బీజేపీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడింది.

# చంద్రబాబు, లోకేష్ తీరుతో కుదేలవుతున్న కూటమి

## - వైసిపి తీర్థం పుచ్చుకున్న 38వ వార్డు జనసేన నేతలు
## - కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** టిడిపిను బలపరి చిన జనసేనకు తగిన ప్రాధాన్యత లేకపోవడంతో నిరాశకు గురవుతున్న కార్యకర్తలు, నాయకులను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో పార్టీ నుండి వీడుతున్నారని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. చంద్రబాబు లోకేష్ దుర్మార్గపు ఆలోచనలతో పార్టీకి అండగా నిలబడే కార్యకర్తలను నేతలను విస్మరించడంతో కూటమి కుదేలవుతుందన్నారు. దీంతో విస్తు పోయిన 38వ వార్డు జనసేన నాయకులు, కార్యకర్తలు పైన లక్ష్మణరావు, పైన జాస్మిత, మూగుడు, శ్యామ్, సవరపు ప్రకాష్, కుమార్, బన్నీ, భారతి, సతీష్, రవి, రామ్ కృష్ణ 38వ వార్డు వైయస్ఆర్సిపి అధ్యక్షుడు గురజారపు రవి ఆధ్వర్యంలో మంగళ వారం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఆశల మెట్ట కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్మోహన్ రెడ్డి అందించిన అభివృద్ధి సంక్షేమం మరెవ్వరూ చేయలేరని స్పష్టం చేశారు. వైయస్సార్సీపి గత ఎన్నికల బరిలో ఓడినప్పటికీ 40 శాతం ప్రజల బలంతో నిలబడిందన్నారు. ప్రజల పక్షాన పోరాడుతూ కూటమి ప్రభుత్వం వ్యతిరేక విధానాలు, ఎన్నికల ముందు బాబు గారిచ్చిన సూపర్ సిక్స్ ఎన్నికల మేనిఫెస్టో బాండ్లు బుట్టదాఖలు చేశారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు అంతే దుర్మార్గపు ఆలోచనలతో ఇంకా ప్రజలను నాయకులను మోసం చేస్తున్నాడని వాసుపల్లి ఆరోపించారు. ప్రశ్నించాల్సిన పవన్ కళ్యాణ్ జాడ లేకుండా ఉన్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా చంద్రబాబు, లోకేష్ చేస్తున్న మోసాలపై పవన్ కళ్యాణ్ ప్రశ్నించి బయటకు రావాలన్నారు. దక్షిణ నియోజకవర్గంలో మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. రోజురోజుకు బలోపేతం అవుతున్న వైఎస్ఆర్సిపి మళ్లీ 2029 ఎన్నికల్లో అఖండ విజయం సాధించి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే ధ్యేయంగా ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 38వ వార్డ్ యూత్ ప్రెసిడెంట్ చేపల నూకరాజు, 38వ వార్డ్ బూత్ ప్రెసిడెంట్స్ సందీప్, చేపల రాజు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రేయ్ డేవిడ్ రాజు, జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, సౌత్ గ్రీవెన్స్ సెల్ ప్రెసిడెంట్ మళ్ళా విజయ్, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ చోడిపిల్లి శివ 38వ వార్డు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవలో కిల్లి ప్రకాష్‌రావు సేవలు ప్రశంసనీయం

## - క్రమశిక్షణ, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం - పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం - ప్రముఖుల ప్రశంసలు, అభినందనలు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రజా సేవను ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా భావించి, క్రమశిక్షణ, నిజా యితీ, అంకితభావంతో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వహించిన జీవీఎంసీ 31వ వార్డు సూపర్వైజర్ (ఔట్‌సోర్సింగ్) కిల్లి ప్రకాష్ రావు సేవలు ప్రశంసనీయమని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రజల మన్ననలు పొందిన వ్యక్తిగా, సహచరులకు ఆదర్శంగా నిలిచిన కిల్లి ప్రకాష్‌రావు పదవీ విరమణ చేసినప్పటికీ ఆయన సేవా స్ఫూర్తి చిరకాలం గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. మంగళవారం పదవీ విరమణ చేసిన కిల్లి ప్రకాష్‌రావుకు స్థానిక డాబాగార్డెన్స్‌లోని వి.జె.ఎఫ్. ప్రెస్‌క్లబ్‌లో మాధవధార జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగ జీవితమంతా ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ నిబద్ధతతో సేవలందించిన కిల్లి ప్రకాష్‌రావు జీవీఎంసీకి మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. కర్తవ్య నిర్వహణలో ఆయన చూపిన నిష్ఠ, సమయపాలన, ప్రజలతో మమేకమయ్యే తీరు ప్రతి ఉద్యోగికి ఆదర్శమని చెప్పారు. సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో ఎలాంటి విమర్శలకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించిన కిల్లి ప్రకాష్‌రావు సహచర ఉద్యోగులు, అధికారులు, ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజ సేవకు కాదని, ఇకపై కూడా తన అనుభవాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగిస్తారని ఆకాంక్షించారు.

కార్యక్రమానికి జాతీయ జర్నలిస్టు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఆర్. నాగరాజు పట్నాయక్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, సహాయ వైద్యాధికారి శంకర్రావు, జీవీఎంసీ అధికారులు, సహచర ఉద్యోగులు, కిల్లి ప్రకాష్‌రావు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, మీడియా ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కిల్లి ప్రకాష్‌రావును శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేసి ఆయన సేవలను కొనియాడారు. భావోద్వేగ వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమంలో పలువురు ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ప్రజా సేవలో ఆయన చూపిన అంకితభావం, మానవీయ విలువలు, నిరాడంబర వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# క్షణాల్లో స్పందించి తప్పిపోయిన బాలికను సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చిన మహారాణి పేట పోలీసులు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పెట్రోలింగ్ నిర్వ హిస్తున్న మహారాణిపేట పోలీసులకు భీమిలి కోస్టల్ పార్క్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో ఒంటరిగా ఉన్న 10 ఏళ్ల బాలిక కనిపించింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బాలికను రక్షించి పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్లారు. పోలీస్ స్టేషన్‌లో బాలికకు భోజనం అందించి, వివరాలు సేకరించారు. బాలిక భీమిలిలోని ఇహ్యా ఫౌండేషన్‌కు చెందినదని, రాజమండ్రి నివాసి అని గుర్తించారు. వెంటనే ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రదించి, వారి సహకారంతో తల్లిదండ్రుల వివరాలు తెలుసుకుని, అనంతరం బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. డా. శంఖబ్రత బాగ్చి, ఐ.పీ.ఎస్, కమీషనర్ ఆఫ్ పోలీస్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ మహారాణిపేట పోలీస్ సిబ్బందిని అభినందించారు.

# సాయి రామకృష్ణ సేవలు ఎంతో విలువైనది

## - టిఎస్ఆర్ పదవి విరమణలో భక్తులు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** నలభై రెండేళ్ల ఉపాధ్యాయ ప్రయాణంలో తోటకూర సాయి రామకృష్ణ చేసిన సేవలు ఎంతో విలువైనవని పలువురు వక్తలు అన్నారు. సామర్లకోట బొచ్చు ఫౌండే షన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ప్రముఖ గణిత అవధాని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ పదవీ విరమణ కార్యక్రమం స్థానిక పాఠశాలలో మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్మిక సంఘ అధ్యక్షులు దవులూరి సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీ తులసి, పి పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఎన్ కనకారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమార స్వామి, జిల్లా విద్యాశాఖ అధికారులు తదితరులు విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో ఎన్నో విజయాలను చవిచూస్తూ ఉత్తమ ఉపాధ్యాయునిగా, ప్రముఖ గణిత అవధానిగా, ప్రధానోపాధ్యాయునిగా బాధ్యతలను నిర్వర్తించి వందలాది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన ఘనత సాయి రామకృష్ణకు దక్కిందన్నారు. పాఠశాల అభివృద్ధి విషయంలోనూ ఎంతగానో కృషిచేసి నిర్విరామంగా అలుపెరగని శ్రామికునిగా పనిచేశారన్నారు. ఆయన స్ఫూర్తితో రానున్న కాలంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం సాయి రామకృష్ణ దంపతులను పట్టణ ప్రముఖులు, అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, అభిమానులు దుస్సాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయిలోని విద్యాశాఖ అధికారులు, కూటమి నాయకులు, అభిమానులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దాపురం ఆసుపత్రికి వైద్య పరికరాలు అందజేత



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి పెద్దాపురం శ్రీ లలిత రైస్ మిల్స్ ఇండస్ట్రీ యాజమాన్యం వైద్య పరికరాలను అందజేశారు. శ్రీ లలిత రైస్ మిల్స్ ఇండస్ట్రీ అధినేతలు మట్టే ప్రసాద్ బాబు, మట్టే శ్రీను బాబులు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న రోగుల సౌకర్యార్థం ఒక ఎయిర్ కండిషనర్ (ఏసీ), అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు రెండు మల్టీ పారా మానిటర్లు అందించారు. అలాగే ఆసుపత్రి నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఆసుపత్రికి సంబంధించిన బోర్‌వెల్‌ను మరమ్మతులు చేయించి, నూతన సబ్‌మర్సిబుల్ మోటార్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రాజ్‌కుమార్ దాతలు మట్టే ప్రసాద్ బాబు, మట్టే శ్రీనుబాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ వారి సేవాభావాన్ని కొనియాడారు. సమాజ ఆరోగ్యా భివృద్ధికి ఇటువంటి దాతృత్వ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డా.శ్రీవిద్య, హెడ్ సిస్టర్ రమాదేవి, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు వంగలపూడి సతీష్, ఐసీటీసీ కౌన్సిలర్ బి శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

## - కో ఆపరేటివ్ వారోత్సవాలలో మొక్కలు నాటిన డిసిఓ



**అమలాపురం, (రాజధాని వార్తలు):** కేంద్రంలో సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటై ఐదు సంవత్సరములు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుపుకుంటున్న సహకార వారోత్సవాల్లో భాగంగా జూన్ 29 నుండి జూలై 6 వరకు కో ఆపరేటివ్ వారోత్సవాలు రోళ్ళపాలెంలో నిర్వహించారు. రోళ్ళపాలెం సహకార సంఘం వద్ద సంఘ చైర్ పర్సన్ మట్ట మహాలక్ష్మి ప్రభాకర రావు ఆధ్వర్యంలో డి సి ఓ ఎ. రాధాకృష్ణ, డి సి ఏ ఓ నూకరాజు సమక్షంలో సహకార రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని సహకార సంఘం చైర్మన్ మట్టా మహాలక్ష్మి ప్రభాకర రావు అన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు తదితర అంశాలను రైతులకు ఆయన వివరించారు. రైతులకు అన్ని విధాల సహకారం అందించి అండగా నిలుస్తామని అన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు, ఆదిమూలం వెంకటేశ్వరరావు, ఆత్మ డైరెక్టర్ ముత్తాబత్తుల వెంకట రమణ, సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# డార్లింగ్ ఫ్యాన్స్‌ను ఊరిస్తున్న త్రిప్తి కామెంట్స్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న స్పిరిట్ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్ షూటింగ్ వేగంగా కొనసాగుతుండగా, తాజాగా హీరోయిన్ త్రిప్తి దిమ్రీ చేసిన కామెంట్స్ ఫ్యాన్స్‌లో మరింత ఆసక్తిని పెంచాయి. సినిమా గురించి ఆమె చెప్పిన దాని కంటే, చెప్పకుండా దాచిపెట్టిన విషయాలే ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పిరిట్ గురించి మాట్లాడిన త్రిప్తి, ఈ సినిమా తనకెంతో ప్రత్యేక అనుభవంగా ఉండబోతోందని చెప్పింది. అయితే ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను ఇప్పుడే వెల్లడించే సమయం రాలేదని స్పష్టం చేసింది. ప్రస్తుతానికి స్పిరిట్ సినిమా గురించి ఎక్కువ విషయాలు చెప్పలేనని, సరైన సమయంలో ప్రేక్షకులు చూసినప్పుడు తప్పకుండా ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నానంటూ ఆమె చేసిన కామెంట్స్ సినిమా చుట్టూ ఉన్న సస్పెన్స్‌ను మరింత పెంచాయి. సాధారణంగా భారీ సినిమాల విషయంలో కథ, పాత్రలు లేదా కీలక అంశాలకు సంబంధించిన చిన్నచిన్న లీక్స్ కూడా బయటకు వస్తుంటాయి. కానీ స్పిరిట్ విషయంలో మాత్రం టీమ్ మొదటి నుంచే పూర్తి గోప్యతను పాటిస్తోంది. త్రిప్తి తాజా కామెంట్స్ కూడా అదే వ్యూహాన్ని మరోసారి స్పష్టంగా చూపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సినిమా గురించి ఆసక్తిని తగ్గించకుండా, ఒక్కో అప్డేట్‌తో హైప్‌ను పెంచాలనే ఉద్దేశంతో మేకర్స్ ముందుకు వెళ్తున్నట్లు కనిపిస్తోంది. ఇక ప్రభాస్ ఫ్యాన్స్‌కు ఈ ప్రాజెక్ట్ మరింత ప్రత్యేకం కావడానికి మరో కారణం కూడా ఉంది. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగాతో ప్రభాస్ మొదటిసారి జతకట్టడం ఈ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ వంటి సినిమాలతో తనదైన మార్క్ చూపించిన సందీప్, ప్రభాస్‌ను ఎలా ప్రజెంట్ చేయబోతున్నారనే ఆసక్తి ఇప్పటికే పీక్‌కు చేరుకుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ నుంచి వచ్చిన చిన్న హింట్ కూడా అభిమానుల్లో కొత్త డిస్కషన్‌కు దారి తీసింది. అలాగే ప్రభాస్-త్రిప్తి డిమ్రీ జోడీ కూడా పూర్తిగా కొత్తది కావడం విశేషం. వీరిద్దరి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందో చూడాలని ఆడియన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యానిమల్ తర్వాత మరోసారి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో నటిస్తున్న త్రిప్తి, ఈ ప్రాజెక్ట్‌పై వ్యక్తం చేసిన నమ్మకం కూడా సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. భారీ తారాగణం కూడా స్పిరిట్‌కు మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. వివేక్ ఒబెరాయ్ స్పిరిట్‌లో విలన్‌గా నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, ఐశ్వర్య దేశాయ్, కాంచన కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో అత్యంత భారీ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా రూపొందుతోంది. ప్రస్తుతం త్రిప్తి చేసిన ఒక్క కామెంట్‌తోనే స్పిరిట్ మరోసారి వార్తల్లో నిలిచింది. కథ గురించి ఒక్క క్లూ కూడా ఇవ్వకుండా సస్పెన్స్‌ను కొనసాగించడమే ఇప్పుడు ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా మారినట్లు కనిపిస్తోంది.

# హిట్ మూవీ సీక్వెల్... పెద్ద పొలిటికల్ వివాదం



సూర్య హీరోగా త్రిష ప్రధాన పాత్రలో ఆర్జే బాలాజీ దర్శకత్వంలో రూపొంది ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన తమిళ మూవీ 'కరుప్పు' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. న్యాయ వ్యవస్థపై పోరాటం అన్నట్లుగా సాగే కరుప్పు మూవీ కథ విషయంలో వివాదం రాజుకున్నప్పటికీ సినిమాకు వచ్చిన స్పందన నేపథ్యంలో అంతా సైలెంట్ అయ్యారు. భారత న్యాయ వ్యవస్థను అవమానించినట్లుగా కరుప్పు ఉందనే విమర్శలు వచ్చాయి. వాటిని జనాలు పట్టించుకోకుండా సినిమాను చూసి హిట్ చేశారు. తెలుగులో వీరభద్రుడు అనే టైటిల్‌తో రిలీజ్ అయ్యి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఓటీటీలో వచ్చిన తర్వాత కూడా ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. సౌత్ ఇండియాలోని అన్ని భాషల ప్రేక్షకులు కరుప్పు మూవీని తెగ ఆధరిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు సీక్వెల్ గురించిన చర్చ ప్రారంభం అయ్యింది.

**బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న కరుప్పు...**

దర్శకుడు ఆర్జే బాలాజీ 'కరుప్పు' కు సీక్వెల్ ఉంటుందని ముందే క్లారిటీ ఇచ్చాడు. సినిమా చివర్లో సీక్వెల్ కోసం కథ లీడ్ ఇచ్చి వదిలి పెట్టాడు. మొదటి పార్ట్‌లో న్యాయవ్యవస్థపై వీరభద్రుడు పోరాటం చేస్తే, సీక్వెల్‌లో పొలిటికల్ వ్యవస్థపై పోరాటం చేసే విధంగా కథను డిజైన్ చేయబోతున్నట్లుగా క్లారిటీ వచ్చింది. తమిళనాడు రాజకీయాలు ప్రస్తుతం రసవత్తరంగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో కరుప్పు 2ను పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిస్తే కచ్చితంగా ఏదో ఒక వర్గం నుంచి వ్యతిరేకత రావడం ఖాయం. అధికార పార్టీని లేదా విపక్ష పార్టీలను ఏమాత్రం సినిమాలో తక్కువ చేసినా కచ్చితంగా పెద్ద గొడవలు అవుతాయి. అందుకే దర్శకుడు ఆర్జే బాలాజీ ఇప్పటికిప్పుడు కరుప్పు సినిమా సీక్వెల్ ను మొదలు పెట్టాలి అనుకోవడం లేదట. ఈ విషయాన్ని స్వయంగా ఆర్జే బాలాజీ ఒక చిట్‌చాట్‌లో చెప్పడంతో అభిమానులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

**సూర్య కరుప్పు సినిమాకు సీక్వెల్...**

ఇటీవల ఒక చిట్ చాట్‌లో దర్శకుడు ఆర్జే బాలాజీ మాట్లాడుతూ... సీక్వెల్‌కు కథను ఎలా డిజైన్ చేయాలి అనే ఆలోచన ఇంకా రాలేదు. అయితే పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో కథ ఉంటుందని మాత్రం చెప్పుకొచ్చాడు. ఇప్పుడే కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయబడింది, సీఎంగా విజయ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సమయంలో పొలిటికల్ బ్యాక్‌డ్రామ్ మూవీ అంటే కాస్త ఆలోచించాల్సిన విషయం అన్నట్లుగా దర్శకుడు ఆర్జే బాలాజీ చెప్పుకొచ్చాడు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయాల్లో ఏదైనా స్పైసీ పొలిటికల్ లైన్ దొరికితే తప్పకుండా కరుప్పు మూవీ సీక్వెల్‌ను ప్లాన్ చేస్తాను అంటూ దర్శకుడు బాలాజీ హామీ ఇచ్చాడు. సూర్య అభిమానులు మాత్రమే కాకుండా అన్ని భాషల సినీ ప్రేక్షకులు సీక్వెల్ కోసం ఎదురు చూస్తున్నప్పటికీ ఆచితూచి వ్యవహరించాలని దర్శకుడు భావిస్తున్నాడట. అందుకే ఇప్పట్లో సినిమా సీక్వెల్‌ను చేయక పోవచ్చని ఆయన సన్నిహితులు అంటున్నారు.

**హీరోయిన్ త్రిషతో సీఎం విజయ్ ప్రేమ వ్యవహారం...!**

రాజకీయాలపై దేవుడు పోరాటం చేస్తే ఎలా ఉంటుందా అనే ఆసక్తికర పాయింట్‌ను ఇప్పటికే తీసుకున్న దర్శకుడు బాలాజీ కథను ముందుకు తీసుకు వెళ్లడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నాడు. ఇప్పుడు కాదు ముందు ముందు సీక్వెల్ చేద్దామని అనుకుంటున్న నేపథ్యంలో అసలేం జరగబోతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కరుప్పు మూవీలో త్రిష నటించిన విషయం తెల్సిందే. సీక్వెల్‌లో ఆమె కొనసాగే అవకాశాలు ఎక్కువ. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కి త్రిషకు ఉన్న సంబంధం గురించి కుప్పలు తెప్పలుగా కథనాలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఆమె నటించే కరుప్పు సీక్వెల్‌లో విజయ్‌కి వ్యతిరేకంగా సీన్స్ ఊహించలేం. అలాకాకుండా విపక్షాలకు వ్యతిరేకంగా అయినా కొన్ని సీన్స్ ఉండే అవకాశం ఉంది. అలా ఉన్న స్ట్రాంగ్‌గా ఉన్న ప్రతిపక్షం నుంచి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. అందుకే దర్శకుడు ఆర్జే బాలాజీ సీక్వెల్ విషయంలో సమయం కావాలి అంటున్నాడని తెలుస్తోంది.

# మహేష్.. ఫ్యాన్స్ మైండ్ సెట్ మారుతుందా?



నార్మల్‌గా ఒక పెద్ద హీరో ఫ్యాన్స్ తమ స్టార్ నుంచి వందల కోట్ల బడ్జెట్, భారీ ఎలివేషన్లు, అదిరిపోయే యాక్షన్ సీన్లు ఉన్న సినిమాలే కోరుకుంటారు. థియేటర్లలో క్లాప్స్ కొడుతూ ఎంజాయ్ చేయడానికి అలాంటి కమర్షియల్ హంగులే ఫ్యాన్స్‌కి ఫస్ట్ ప్రెఫరెన్స్. కానీ మహేష్ బాబులాంటి ఒక సూపర్ స్టార్ తన హోమ్ బ్యానర్ జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా 'రావు బహదూర్' లాంటి ఒక చిన్న కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాను ప్రొడ్యూస్ చేయడానికి అడుగులు వేశారు. ఇలాంటి టైమ్‌లో అసలు కమర్షియల్ మాస్ సినిమాలు చూసే ఫ్యాన్ బేస్, ఈ చిన్న సినిమాలను ఎలా ఓన్ చేసుకుంటుందనే విషయం ఇప్పుడు ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఒక స్టార్ హీరో తదుపరి ప్రాజెక్ట్‌కి చాలా సమయం పడుతున్నప్పుడు లేదా లార్జర్ ద్యాన్ లైఫ్ సినిమాల కోసం ఏళ్ల తరబడి వర్క్ చేస్తున్నప్పుడు ఫ్యాన్స్‌లో ఒక రకమైన సైలెన్స్ వచ్చేస్తుంది. ఆ గ్యాప్‌లో తమ హీరో స్క్రీన్‌పై కనిపించకపోయినా, అతని బ్రాండ్ నేమ్‌తో ఒక క్రేజీ చిన్న సినిమా వస్తుందంటే ఫ్యాన్స్‌లో మెల్లగా అటెన్షన్ స్టార్ట్ అవుతుంది. తమ హీరో పేరు మీద వచ్చే ప్రాజెక్ట్ కాబట్టి సోషల్ మీడియాలో ట్రెండ్ చేయడం, పబ్లిసిటీని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లడం ఫ్యాన్స్ బాధ్యతగా తీసుకుంటారు. ఇలాంటి ప్రయోగాలు జరిగినప్పుడు ఫ్యాన్స్ ఆలోచనా విధానంలో కూడా ఒక కొత్త మార్పు వస్తుంది. ఇప్పటివరకు కేవలం ఫైట్లు, రికార్డుల గురించే మాట్లాడుకునే కుర్రాళ్ళు, మెల్లగా కథల గురించి డిస్కస్ చేయడం స్టార్ట్ చేస్తారు. తమ హీరో ఒక చిన్న సినిమాను సపోర్ట్ చేస్తున్నాడంటే అందులో ఏదో ఒక స్ట్రాంగ్ పాయింట్ ఉండే ఉంటుందని నమ్ముతారు. దీనివల్ల నార్మల్‌గా థియేటర్లకు రాని కంటెంట్ లవర్స్ కూడా ఈ సినిమాల వైపు అడుగులు వేస్తారు. పెద్ద హీరోల నీడ దొరకడం వల్ల చిన్న సినిమాలకు వచ్చే హైప్ మామూలుగా ఉండదు. రోజుకో కొత్త పోస్టర్, టీజర్ అంటూ సోషల్ మీడియాలో ఫ్యాన్స్ చేసే హడావుడి వల్ల అసలు సినిమా రేంజ్ మారిపోతుంది. టాలెంట్ ఉన్నా లైమ్ లైట్‌లోకి రాలేకపోతున్న యాక్టర్స్‌కి, కొత్త ఆలోచనలతో వచ్చే దర్శకులకు ఈ క్రేజ్ బూస్ట్‌లా మారుతుంది. వాళ్ళ కథను జనాల్లోకి బలంగా తీసుకెళ్లడానికి ఇది చాలా హెల్ప్ అవుతుంది. ఇండస్ట్రీ పరంగా చూసుకుంటే ప్రతీ వారం బాక్సాఫీస్ రన్ అవ్వడానికి ఇలాంటి చిన్న సినిమాలు ఆడటం చాలా ముఖ్యం. పెద్ద సినిమాలు ఎప్పుడో ఏడాదికి ఒకటి రెండు వస్తాయి. మిగతా టైమ్‌లో థియేటర్లు కలకలలాడాలంటే కథలు బాగుండే చిన్న సినిమాలు రెగ్యులర్‌గా రావాలి. స్టార్ హీరోలే తమ బ్రాండ్ వాల్యూతో వీటికి బ్యాకప్‌గా నిలిస్తే, బిజినెస్ పరంగా కూడా అందరికీ సేఫ్టీ దొరుకుతుంది. ఇక మహేష్ బాబు వేసిన ఈ అడుగు ఇప్పటికే కొందరు ఫాలో అవుతున్నారు. అలాగే మరికొందరు కూడా ట్రాక్‌లోకి రావాలి. స్టార్స్ పెద్ద సినిమాలతో బిజీగా ఉన్నా, ఇలాంటి చిన్న ప్రయోగాలను ఫ్యాన్స్ కూడా ఓన్ చేసుకోవడం అలవాటు చేసుకుంటే టాలీవుడ్‌లో మరిన్ని క్రేజీ కథలు వచ్చే ఛాన్స్ ఉంటుంది.

# దిల్ రాజు మళ్ళీ పాత రూట్ పట్టుకున్నాడా?



టాలీవుడ్‌లో దిల్ రాజు పేరుకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కానీ ఈమధ్య ఆయన కంప్లీట్‌గా స్టార్ కాంబినేషన్ చుట్టూనే తిరుగుతున్నారనే కామెంట్స్ గట్టిగా వినిపించాయి. అందుకే కాస్త గ్యాప్ తీసుకుని తన ప్రొడక్షన్ స్ట్రాటజీని పూర్తిగా మార్చే పనిలో పడ్డారు. ఇప్పుడు ఆయన ఫోకస్ అంతా మళ్ళీ తనకి ఎంతో కలిసొచ్చిన పాత ట్రాక్ మీదకే వెళ్లినట్లు తెలుస్తోంది. ఒకప్పుడు ఆయన బ్యానర్‌లో సినిమా అంటే కొత్త డైరెక్టర్లకు వరుస ఛాన్సులు వచ్చేవి. ఆర్య సినిమాతో సుకుమార్, బొమ్మరిల్లుతో భాస్కర్, కొత్త బంగారు లోకం సినిమాతో శ్రీకాంత్ అడ్డాల లాంటి టాలెంటెడ్ డైరెక్టర్లను ఇండస్ట్రీకి పరిచయం చేసింది ఆయనే. ఆ సినిమాలతో బాక్సాఫీస్ దగ్గర జాక్ పాట్ లాభాలు అందుకోవడమే కాకుండా కంటెంట్‌తో ఒక సెన్సేషన్ క్రియేట్ చేశారు. ఆ తర్వాత వాళ్ళంతా స్టార్ డైరెక్టర్స్‌గా మారిపోయారు. కాలక్రమంలో ఆయన పెద్ద హీరోలతో పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ వైపు అడుగులు వేశారు. స్టార్ హీరోలతో సినిమాలు చేస్తే బిజినెస్ పరంగా సేఫ్ అయినా సరే బడ్జెట్ టెన్షన్లు చాలా ఉంటాయి. పైగా ఇప్పుడున్న ఆడియన్స్ కేవలం స్టార్‌డమ్‌ని చూసి థియేటర్లకు రావడం లేదు. స్టోరీ నెరేషన్ కొత్తగా ఉంటేనే టికెట్ తెగుతోంది. కంటెంట్ కనెక్ట్ అవ్వకపోతే సినిమాను మొదటి రోజే రిజెక్ట్ చేస్తున్నారు. ఈ గ్రౌండ్ రియాలిటీని కరెక్ట్‌గా అర్థం చేసుకున్న దిల్ రాజు డీఆర్డీ పేరుతో మరోసారి కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చేయాలని డిసైడ్ అయ్యారు. నేటి జనరేషన్ పల్స్ పట్టుకునే కుర్ర డైరెక్టర్ల కోసం ఏకంగా ఒక స్పెషల్ స్క్రిప్ట్ టీమ్‌ని కూడా రంగంలోకి దించారు. మంచి కాన్సెప్ట్‌తో వచ్చే కొత్త వాళ్లకు తన బ్యానర్‌లో రెడ్ కార్పెట్ వేస్తూ తనదైన స్టైల్‌లో ప్లానింగ్ చేసుకుంటున్నారు. కంటెంట్ నచ్చితే చాలు కార్పొరేట్ సంస్థలతో కలిసి వరుస సినిమాలు నిర్మించడానికి అడుగులు వేస్తున్నారు. ఫ్యూచర్‌లో ఇలాంటి చిన్న సినిమాలు అరడజను దాకా రిలీజ్ చేయాలనేది వాళ్ల టార్గెట్‌గా కనిపిస్తోంది.

బడ్జెట్ తక్కువ కాబట్టి ఒక ప్రాజెక్ట్‌తో హిట్ కొట్టినా మిగతా వాటికి పెట్టిన పెట్టుబడి ఈజీగా వెనక్కి వస్తుందనేది ఒక పక్కా బిజినెస్ కాలిక్యులేషన్. స్టార్ హీరోల డేట్స్ కోసం ఏళ్ల తరబడి వెయిట్ చేసే కన్నా కథను నమ్ముకుని కొత్త వాళ్ళతో మ్యాజిక్ చేయడమే బెటర్ అని ఆయన ఫిక్స్ అయినట్లు అర్థమవుతోంది. దిల్ రాజు తన పాత సక్సెస్ ఫార్ములాతో మళ్ళీ ఒకప్పటి లాగా బ్లాక్ బస్టర్స్ ఇస్తారో లేదో చూడాలి. ఇండస్ట్రీలో ఎదగాలని చూస్తున్న కొత్త దర్శకులకు మాత్రం ఇదొక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పవచ్చు. ప్రస్తుతం దిల్ రాజు ప్రొడక్షన్‌లో ఎల్లమ్మ, వంశీ పైడిపల్లి - సల్మాన్ ఖాన్, రౌడి జనార్దన్ ప్రాజెక్టులు లైన్‌లో ఉన్నాయి.

# మేతల కంపెనీలపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

## - రొయ్యల మేతల ధరలను పెంపును నిరసిస్తూ ఆక్వా రైతుల నిరసన - అప్పడా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్




**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఆక్వా సాగులో రైతులు అన్ని విధాలుగా నయవంచనకు గురవుతున్నారని ఆక్వా రైతులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రొయ్యల మేతల ముడిసరుకుల ధరలు తగ్గినా ఏకపక్షంగా రొయ్యల మేతల ధరలు పెంచడమే కాకుండా అప్పడా చట్టం ద్వారా ప్రభుత్వం మేతల తయారీ దారులతో చర్చించి జరిగిన ఒప్పందాన్ని సైతం తుంగలో తొక్కి అమలు చేయడం లేదని మండిపడ్డారు. పెరిగిన రొయ్యల మేతల ధరలను నిరసిస్తూ ఏపీ రాష్ట్ర ఆక్వా సంఘం పిలుపు మేరకు అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో కోనసీమ జిల్లా అద్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు ఆధ్వర్యంలో ఆక్వా రైతులు, ఫీడ్ అసోసియేషన్ డీలర్లు నిరసన చేపట్టారు. ఆక్వా మేతల దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేయగా ఆక్వా రంగానికి సంబందించి అన్ని విభాగాల సామాగ్రి దుకాణాలను మూయించారు. అనంతరం ఎర్రవంతెన వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. రొయ్యల మేతల ధరలు వెంటనే తగ్గించాలని, రొయ్యల ధరను పెంచాలని, ఆక్వా ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని నినదించారు. రొయ్యల మేతల విషయంలో శాసిస్తోన్న సిండికేట్ వ్యవస్థను అరికట్టాలని, నాణ్యమైన సీడ్ ఆక్వా రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. రొయ్యల ప్రాసెసింగ్‌పై ప్రభుత్వం వెంటనే కమిటీ వేయాలని తగ్గించిన రొయ్య రేట్లను తక్షణం పెంచాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు రాజు మాట్లాడుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ప్రభుత్వానికి ఆక్వా రైతుల అగచాట్లు తెలపాలనే రైతులు నిరసన బాటపట్టినట్లు తెలిపారు. 2020 అప్పడా చట్టం వచ్చినా ఈ రోజు వరకు దాని అమలు చేయకపోవడంతో ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆక్వా పరిశ్రమను లక్షలాది ఎకరాలకు విస్తరించి ఆక్వా ఉత్పత్తుల పెంచాలని పిలుపునిచ్చారని అయితే దానికి అనుగుణంగా అధికార యంత్రాంగం లేక ఆక్వా పరిశ్రమ సంక్షోభంలోకి వెళుతుందన్నారు. ఒకప్పుడు ప్రశాంతంగా బ్రతికిన ఆక్వా రైతాంగం ఈ రోజు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఆక్వా పరిశ్రమల పట్ల సానుకూలత వ్యక్తం చేస్తున్నా ఆక్వా పరిశ్రమలో తిష్ట వేసిన దళారీవ్యవస్థ, సిండికేట్ వ్యవస్థ వల్ల ఆక్వా పరిశ్రమనే నమ్ముకున్న రైతులు నష్టపోయి దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా ఫీడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లూరి రమేష్ రాజు మాట్లాడుతూ మొన్నటి వరకు ట్రంప్ విధించిన సుంకాలతో సతమతమైన ఆక్వా పరిశ్రమ, మరోపక్క పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధం కారణంగా మరింత నష్టపోయిందన్నారు. ఆక్వా రంగాన్ని నమ్ముకుని ఎక్స్ పోర్టర్లు, ఫీడ్ తయారీ తదితరులు ఉన్నప్పటికీ ప్రధానంగా నష్టపోతుంది మాత్రం చివరకు రైతు మాత్రమేనన్నారు. ముడిపదార్థాలు ధరలు తగ్గినప్పటికీ ఒక్కసారిగా ఫీడ్ రేట్లు పెంచడం సరైంది కాదన్నారు. అయితే ముడి సరుకుల ధరలు తగ్గినప్పుడు మేతల ధరలు ఎందుకు తగ్గించలేదని ఆయన ప్రశ్నించారు. రైతు లేనిదే ఎవ్వరూ ఉండరని, అందుకే ఫీడ్ అసోసి యేషన్ డీలర్లు అందరూ స్వచ్ఛందంగా షాపులన్నీ మూసి తమ మద్దతు తెలిపామన్నారు.

రాష్ట్ర రైతు నాయకుడు యాళ్ల వెంకటానందం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతులు అన్ని కార్యక లాపాలు స్తంభింప చేశారని, తమ ఆవేదన నిరసన రూపంలో ప్రభుత్వానికి తెలియజేయాలనే ఈ కార్య క్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పెరిగిన మేతల ధరల విషయంలో ప్రభుత్వం చర్చించాక ఓ ఒప్పందానికి వచ్చిన మేతల తయారీ దారులు ఇంతవరకు దానిని అమలు చేయలేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే తమ నిరసను మరింత ఉధృతం చేశామన్నారు. మరో రైతు రుద్రరాజు నానీరాజు మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమపై ఆధార పడి జీవిస్తున్న కుటుంబాలెన్నో ఉన్నాయని, ఈరోజు ఆక్వా పరిశ్రమ ఎదుర్కొంటున్న సంక్షోభం వల్ల అనేక కుటుం బాలు రోడ్డున పడే పరిస్థితి తలెత్తుతోందన్నారు. ఈ నిరసనలో మోటూరి నాని, వేగిరాజు శ్రీను, రుద్రరాజు కాశీరాజు, బొరుసు రాము, అల్లూరి సోమరాజు, తాండపల్లి దొరబాబు, అంజి, రుద్రరాజు రవి, సుధీర్ రాజు, అల్లూరి మధు, గోడిలంక బాబు, గంగుమళ్ల ఏసుబాబు, రెల్లిగడ్డ రాము తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బంగారమ్మ తల్లి పండుగ

## - ప్రత్యేక పూజలు నిర్వహించిన గంట్ల



**విశాఖ / సింహాచలం, (రాజధాని వార్తలు):** అప్పన్న సోదరి ఏడు గ్రామాల ప్రజల ఇలవేల్పు శ్రీ బంగారమ్మ తల్లి పండుగ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఈ పండు గను సాంప్రదాయబద్ధంగా జరిపించారు. తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన గావించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు జాతీయ జర్నలిస్టులు సంఘం కార్యదర్శి.. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మెట్ల మార్గంలో ఉన్న సింహాద్రినాధుడు ను గంట్ల శ్రీనుబాబు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక హెచ్పీసీఎల్ గ్యాస్ డీలర్ గంట్ల కిరణ్ బాబు నవయువ సేవా సంఘం అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుపతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ్, పిఎంఎస్ యాప్‌లు ఆవిష్కరించిన మంత్రి నారాయణ




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విఎంఆర్డిఎ అధ్వ ర్యంలో డిజిటలైజేషన్‌లో భాగంగా ఇంజనీరింగ్ విభాగంలో పారదర్శకత కోసం నూతనంగా రూపొందించిన నిర్మాణ్ యాప్, లే అవుట్ల వ్యవస్థలో కార్యకలాపాలు సమర్థవంత నిర్వహణ కోసం రూపొందించిన పిఎంఎస్ యాప్‌లను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి నారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మంగళవారం సాయంత్రం మధురవాడ జోనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి నారాయణ, స్థానిక శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. విఎంఆర్డిఎ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ పాల్గొని, యాప్‌ల విశిష్ఠత ను వివరించారు. నిర్మాణ్ యాప్ ద్వారా విఎంఆర్డిఎ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపడుతున్న అన్ని ప్రాజెక్టుల నిర్వహణలో భాగంగా అంచనాలను రూపొందించడం, పరిపాలనపరమైన ఆమోదాలు, పనుల అమలు, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ, గుత్తేదారుల నిర్వహణ, బిల్లులు చెల్లింపుల ప్రక్రియ అంతా నిర్మాణ్ యాప్ ద్వారా జరగనున్నాయి. రియల్ టైమ్ పర్యవేక్షణ ద్వారా పారదర్శకత, బాధ్యత, పనితీరు, ప్రాజెక్టులు సమయానికి పూర్తి చేయటం ద్వారా పనితీరు మెరుగు పడుతుందని పేర్కొన్నారు. పిఎంఎస్ (ప్లాట్ మేనేజ్మెంట్ సిస్టమ్) యాప్ అనేది విఎంఆర్డిఎ అభివృద్ధి చేసిన లే అవుట్‌లు, ప్లాట్‌లు, భూ రికార్డులు, వేలం, చెల్లింపులు, ప్లాట్ కేటాయింపులు, వేలం షెడ్యూల్ తదితర కార్యకలాపాలు సమర్థవంత నిర్వహణ కోసం ఈ యాప్ ను రూపొందించారు. దీని ద్వారా కొనుగోలుదారులకు క్రయ, విక్రయాలు మరింత సులభతరం కానున్నాయన్నారు. కార్యక్రమంలో జీవీఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, విఎంఆర్డిఏ అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, ముఖ్య ప్రణాళికా అధికారిణి దివ్యలత, ఓ ఎస్ డి కృష్ణ నాయక్, కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, డిఎఫ్ఓ రమణమూర్తి, ఎస్టేట్ అధికారి దయానిధి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు నాటికి రామవరం రైతులకు ప్లాట్లు

## - నిర్దిష్ట సమయంలోగా పెండింగ్ టీడీఆర్‌ల జారీ
## - సమస్యల పరిష్కారానికి మంత్రి నారాయణ ఆదేశం



**విశాఖ/మధురవాడ, (రాజధాని వార్తలు):** నియోజక వర్గంలో వివిధ సమస్యలకు యుద్ధ ప్రాతిపదికన పరిష్కారం చూపించాలని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మధుర వాడ, ఎండాడలలో క్షేత్ర స్థాయి పర్యటన అనంతరం జోనల్ కార్యాలయంలో జీవీఎంసీ, వి.ఎం.ఆర్.డి.ఎ. అధికారులతో మంత్రి పి.నారాయణ సమీక్ష నిర్వహించారు. ల్యాండ్ పూలింగ్ చేసిన రామవరం రైతులకు ఆగస్టులో ప్లాట్లు అందజేస్తామని వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ తేజ్ భరత్ తెలిపారు. రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు పంపిణీ చేసిన తర్వాత వి.ఎం.ఆర్.డి.ఎ. వాటా భూమిలో ప్లాట్ల అభివృద్ధి ప్రారంభిస్తామని, వీటి అమ్మకం ద్వారా రూ.800 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నామని ఆయన వివరించారు. ఈ లే అవుట్‌లో 80 అడుగులు, 60 అడుగుల రెండు అప్రోచ్ రోడ్ల పనులను త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. భీమిలిలో రోడ్ల విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి నారాయణ సూచించారు. పెండింగ్‌లో ఉన్న సింహాచలం బి.ఆర్.టి.ఎస్. రోడ్డు, రేవళ్లపాలెం, బక్కన్నపాలెం, శివశక్తినగర్ మాస్టర్ ప్లాన్ రోడ్ల టీడీఆర్‌లను నిర్దిష్ట సమయంలోగా జారీ చేయాలని ఆదేశించారు. టీడీఆర్‌ల జారీలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని డీటీడీసీపీ విద్యుల్లతతో మంత్రి ఫోన్లో మాట్లాడారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల విలీనం సాధ్యాసాధ్యాల గురించి చర్చించారు. మధురవాడలో రూ.750 కోట్లతో ప్రతిపాదించిన తాగునీటి ప్రాజెక్టు, రూ.550 కోట్లతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీల ఏ దశలో ఉన్నాయనేది అధికారులు తెలియజేశారు. భీమిలిలో క్రీడాభివృద్ధి కోసం స్టేడియం అభివృద్ధి సాగర్ నగర్ సన్ క్యాంపస్ నుంచి ఎండాడ ఎం.కె. వన్ వరకు నిర్మిస్తున్న రోడ్డు పనుల జాప్యం.. టిడ్కో ఇళ్ల మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ తేజ్ భరత్, అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, కార్యదర్శి మురళీకృష్ణ, ఓ.ఎస్.డి. కృష్ణ నాయక్, చీఫ్ ప్లానర్ దివ్యలత, జీవీఎంసీ చీఫ్ సిటి ప్లానర్ ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు వినయ్ కుమార్, సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ద్వాదశ నదీ పుష్కర పుణ్యస్నాన ఫలసిద్ధి : అనన్య భక్తి శ్రద్ధలకు దక్కిన అరుదైన సత్కారం




**విజయనగరం, (రాజధాని వార్తలు):** హిందూ సనాతన ధర్మంలో నదులను కేవలం నీటి ప్రవాహాలుగా కాకుండా, పాపాలను హరించి పుణ్యాన్ని ప్రసాదించే జీవనదులుగా ఆరాధించడం అనాదిగా వస్తున్న ఆచారం. అటువంటి నదీమతల్లులకు బృహస్పతి గ్రహ సంచారాన్ని బట్టి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అద్భుతమైన పర్వదినమే 'పుష్కరం'. ఒక పుష్కరం సమయంలో నదిలో స్నానం ఆచరిస్తే, సకల తీర్థాలలో స్నానం చేసిన పుణ్యం లభిస్తుందని ప్రతీతి. అటువంటిది, గడిచిన 12 సంవత్సరాలుగా ఒక్క పుష్కరం కూడా మానకుండా, గంగానది మొదలుకొని ప్రాణహిత నది వరకు ద్వాదశ నదులలో పుణ్యస్నానాలు ఆచరించిన దంపతుల నిష్ఠ, వారి ఆధ్యాత్మిక ప్రయాణం అనన్య సామాన్యమైనది. ఈ మహా సంకల్పాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ఆ పుణ్య దంపతులకు తోట పాలెం ఆర్యవైశ్య సంఘం సత్కరించటం ముదావహం. విజయనగరం చరిత్రలో ఇటువంటి విశిష్టమైన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించడం ఇదే తొలిసారి అని చెప్పడం అతిశయోక్తి కాదు . ద్వాదశ నదులలో పుణ్యస్నానాలు ఆచరించిన ఆకి శుభలక్ష్మి, సూర్య ప్రకాశరావు దంపతులకు, కందుల అలివేణి మంగతాయారు, శ్రీనివాసరావు దంపతులకు, వబ్బిలి శెట్టి భారతి,వెంకటరమణమూర్తి (రాంజీ) దంపతులకు, మానేపల్లి లక్ష్మి, వీర వెంకట సత్యనారాయణ (వీరన్న బాబు) దంపతులకు, కట్టమూరి సౌభాగ్యం, రామ కోటేశ్వరరావు దంపతులకు, అచ్చం విజయలక్ష్మి, సురేష్ కుమార్ దంపతులకు వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సంఘం వ్యవస్థాపకులు ఓబ్బిలి శెట్టి ఏడుకొండలు, అధ్యక్ష కార్యదర్శులు ఆకి సూర్య ప్రకాశరావు, మండవిల్లి కాశీ విశ్వేశ్వరరావు, కోశాధికారి కే తిరుపతిరావు, సంఘం ఉపాధ్యక్షులు మరియు ఈ ప్రాజెక్టు చైర్మన్ కొల్లా వెంకటరాజు, సంఘం ఉపాధ్యక్షులు తవ్వ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# 4న అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం కోటలో గల స్కూల్ ఆఫ్ మేనేజ్ మెంట్ స్టడీస్‌లో జూలై నాలుగో తేదీన ఉదయం 10 గంటలకు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కె.వి.లక్ష్మీపతి రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు వంటి దేశభక్తుల గురించి వారి పోరాట పటిమ గురించి తెలియజేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అటువంటి మహనీయుల జీవిత విశేషాలు తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు స్ఫూర్తిని పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సమైక్య భారతి సమన్వయకర్త పి కన్నయ్య, శ్రీ వాసవి ఆర్యవైశ్య సేవా సంఘం కంటోన్మెంట్ శాఖ అధ్యక్షులు డిమ్స్ రాజు, వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్ర దేవి, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ విజయనగరం శాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు గిరిజా ప్రసన్న, స్కూల్ ఆఫ్ మేనేజ్ మెంట్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ హరికృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన నియోజకవర్గం ఇంచార్జి పదవి కోసం అధికంగా వినతులు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** జనసేన శ్రీకాళహస్తి నియోజక వర్గంలో ఖాళీగా వున్న నియోజకవర్గం జనసేన ఇంచార్జి పదవి తమకే కావాలని నియోజకవర్గం జనసేన సైనికులు తిరుపతి పార్లమెంట్ జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ ఇంచార్జి ఎమ్మెల్యే లోకం మాధవికి వినతులు అధికంగా అందినట్టు సమాచారం. అందులో దేవస్థానం పాలక మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, గరికపాటి చంద్ర శేఖర్, పేట బ్రదర్స్, దండి రాఘవయ్య, ఆయన కుమారుడు దండి నరేంద్ర, నగరం జయలలిత, కోటా కుటుంబ సభ్యులు ఉన్నట్టు సమాచారం. మరి వీరే కాకుండా మరికొంతమంది కూడా నియోజకవర్గం జనసేన ఇంచార్జి పదవి కోసం అర్జీలు సమర్పించారని సమాచారం. మరి వారిలో ఎవరికీ నియోజకవర్గం జనసేన ఇంచార్జి పదవి వరిస్తుందో వేచి చూడాలి.

# కరపలో వైభవంగా శ్రీ పుష్పయాగం

## - భక్తులను అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు







**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలం స్థానిక శ్రీ పర్వతవర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీ పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నెల 25న స్వామివారి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించగా, సోమవారం త్రిశూల స్నానం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శైవాగమ పద్ధతిలో స్వామి, అమ్మవార్లకు శ్రీ పుష్పయాగాన్ని శైవాగమ పండితుడు డి.ఈశ్వర్ శర్మ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు విలపర్తి శ్రీనివాస్, రాజు సేవలను అందించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పి.రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 20 మందికి పైగా చిన్నారులు వివిధ భంగిమలతో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కాకినాడ శాఖ మేనేజర్ పుల్లకవి శ్రీకాంత్ చిన్నారులను అభినందించి బహుమతులు అందజేశారు. పుష్పయాగం, కూచిపూడి నృత్య ప్రదర్శనలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందారు.

# అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై పట్టు సాధించాలి

## - నూతన సాంకేతిక అభ్యాసనతో బోధన, విద్యార్థుల అభ్యాసంలో ఎంతగానో ఉపయోగం

## - బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం




**అల్లవరం, (రాజధాని వార్తలు):** ఎప్పటికప్పుడు మారుతున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నైపుణ్యాన్ని పెంపొందించుకొని పరిశోధన, బోధన, విద్యార్థుల అభ్యాసంలో సమర్థవంతంగా వినియోగించాలని రిసోర్స్ పర్సన్ అశ్విన్ కుమార్ అన్నారు. ఓడలరేవు బోనం వెంకటాచలమయ్య ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి), ఎడ్యునెట్ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏ పి ఎస్ ఎస్ డి సి) సంయుక్త ఆధ్వ ర్యంలో మంగళవారం నిర్వహిస్తున్న "ఎజెంటిక్ ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్వాంటం కంప్యూటింగ్" అంశాలపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్ డి పి) నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి డా.కె.రాజశేఖర్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా ఎం.అశ్విన్ కుమార్ రిసోర్స్ పర్సన్‌గా అధ్యాపకులకు విలువైన మార్గదర్శకత్వాన్ని అందించారు. కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన 50 మంది అధ్యాపకులు పాల్గొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై నిపుణుల నుంచి శిక్షణ పొందుతున్నారు. మొదటి రోజు ఎజెంటిక్ ఏఐ యొక్క ప్రాథమిక అంశాలు, కృత్రిమ మేధస్సు ఆధారిత ఏజెంట్ వ్యవస్థలు, వాటి నిర్మాణం, పనితీరు, అలాగే విద్యా, పారిశ్రామిక రంగాల్లో వాటి అనువర్తనాలపై సమగ్ర అవగాహన కల్పించారు. రెండవ రోజు సైబర్ సెక్యూరిటీ, క్వాంటం కంప్యూటింగ్ రంగాల్లో తాజా పరిణామాలు, సైబర్ భద్రతా సవాళ్లు, డేటా రక్షణ, క్వాంటమ్ కంప్యూటింగ్ మౌలిక సూత్రాలు, భవిష్యత్ అవకాశాలపై నిపుణులు విశ్లేషణాత్మకంగా వివరించారు. ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా అధ్యాపకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై తమ నైపుణ్యాలను మరింతగా పెంపొందించుకుని, వాటిని బోధన, పరిశోధన మరియు విద్యార్థుల అభ్యాసంలో సమర్థవంతంగా వినియోగించగలరని కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వి ఎన్ ఎస్ ఆర్ రత్నాకర్ రావు, చైర్ పర్సన్ డాక్టర్ బోనం కనకదుర్గ అన్నారు. కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ తదితర అత్యాధునిక సాంకేతిక అంశాలపై నిపుణులచే ప్రత్యేక ఉపన్యాసాలు, ప్రాయోగిక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్యక్రమ కో-ఆర్డినేటర్ డా.కె.రాజశేఖర్ తెలిపారు.

# ఎంపీ సానా సతీష్ బాబుకు ఘన సత్కారం

## - యువతకు ఉపాధి, ప్రజా అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం : రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** యువతకు ఉపాధి కల్పించడం, ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు అన్నారు. ఆయన రెండోసారి రాజ్యసభకు ఎన్నికైన సందర్భంగా తెదేపా జిల్లా కార్యదర్శి గంధం పళ్లంరాజు ఆధ్వర్యం లో సోమవారం రాత్రి అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో సతీష్ బాబును ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసిన అరాచకాలను తుడిచి పెడుతూ ప్రజా రంజక పాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఎంపీగా సానా సతీష్ బాబు రెండోసారి ఎన్నికవడం కోనసీమ ప్రాంతానికి ఎంతో గర్వకారణమని డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అభివృద్ధిలోనూ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ ఆయన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్రంలో గత గొడ్డలి పార్టీ కులాలను విభజించి పబ్బం గడుపు కుంటే, మన కూటమి ప్రభుత్వం మాత్రం అన్ని వర్గాలను కలుపుకుంటూ ముందుకు సాగుతుందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు అన్నారు. జిల్లాలో డొక్కా సీతమ్మ, దొమ్మేటి వెంకటరెడ్డి వంటి మహానుభావుల సేవలను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఇదే వేదికపై కోనసీమకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ఆర్.సాత్విక్ సాయిరాజ్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రకటిస్తూ, సన్మాన పత్రాన్ని అందించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మహాసేన రాజేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అల్లాడ స్వామినాయుడు, మోకా ఆనంద సాగర్, ఆరేటి ప్రకాశ్, ఆకుల రామకృష్ణ, వాసురెడ్డి ఏసుదాసు, వాసంశెట్టి సత్యం, నల్లా పవన్, మోకా సుబ్బారావు తదితరులు పాల్గొని ఎంపీ సతీష్ బాబును ఘనంగా సత్కరించారు.



# మాజీ ముఖ్యమంత్రిని కలిసిన కామిరెడ్డి

**పెళ్లకూరు, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆయన సతీమణి ప్రభవతమ్మ పూర్వకంగా కలిసి వైయస్ జగన్మోహన్ రెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం పలు రాజకీయ అంశాలపై వైయస్ జగన్మోహన్ రెడ్డితో చర్చించారు.

# మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడలో నూతన డయాలిసిస్ విభాగం ప్రారంభం

## - ప్రజలకు మరింత చేరువలో ఆధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు





**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలిసిస్ విభాగాన్ని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌ప్లాంట్ సేవలు, అరుదైన వ్యాధులకు చికిత్సలు, అత్యాధునిక వైద్య సదు పాయాలను అందుబాటు ఖర్చుతో అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వేగంగా వైద్య సేవలను విస్తరిస్తున్న సంస్థల్లో మెడికవర్ హాస్పిటల్స్ గ్రూప్ ముందంజలో ఉందన్నారు. ప్రజలకు అందుబాటు ధరల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందిస్తూ ఆరోగ్య రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని కొనియాడారు. డా.ఎన్టీఆర్ వైద్య సేవ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ద్వారా కాకినాడ జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం హర్షణీయమన్నారు. సామాన్య ప్రజలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమైన విషయమని చెప్పారు. నూతనంగా ప్రారంభించిన డయాలిసిస్ విభాగం ద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్న రోగులకు మెరుగైన చికిత్స అందుతుందని తెలిపారు. అలాగే క్యాన్సర్, గుండె, మెదడు, వెన్నుముక సంబంధిత వ్యాధులతో పాటు అన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఒకేచోట అందుబాటులో ఉండటం స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజ నకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ ఎన్.అంజిబాబు మాట్లాడుతూ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నాణ్య మైన డయాలిసిస్ సేవలను అందించేందుకు ఈ నూతన విభాగాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. డా.ఎన్టీఆర్ వైద్య సేవ, ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా సామాన్య ప్రజలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక వైద్య విభాగాలను ప్రారంభించి, కాకినాడతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, బీజేపీ ప్రతినిధి నాని, మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలకు ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు బహుకరణ

## - చదువే తల రాతను మార్చేది.. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి - విద్యను ప్రోత్సహించేందుకు ఆ ట్రస్టులు ముందుంటాయి




**అల్లవరం, (రాజధాని వార్తలు):** మన తలరాతను మార్చేది చదివిని విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విశ్రాంతి ఉపాధ్యాయుడు,మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మోసుగంటి వెంకటేశ్వరరావు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలకు మోసుగంటి గంగయ్య మెమో రియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛార్టిబుల్ ట్రస్ట్ కొమరగిరిపట్నం, రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛార్టిబుల్ ట్రస్ట్ గోడిలంక వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం 25000/- (ఇరవై ఐదు వేల రూపాయలు) విలువైన 10 సీలింగ్ ఫ్యాన్లు, 20 యల్.ఇడి. ట్యూబ్ లైట్లును గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యన్.శ్రీనివాస్‌కు అందజేసారు. ట్రస్టు అధ్యక్షులు వెంకటేశ్వరరావు గురుకుల పాఠశాలల ఆవశ్యకతను వివరిస్తూ ఎందరో విద్యార్థులు గురుకుల పాఠశాలలో చదివి ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించారని అన్నారు. చదువుతోనే విజ్ఞానం, కీర్తి, సంపద వస్తుందని విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులను కోరారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నకుల రాజు, తోట బాలకృష్ణ ఈ రెండు ట్రస్టుల చేస్తున్న విద్య,వైద్య సేవలను, సుమారు జిల్లాలో11 మండలాల్లో వివిధ పాఠశాలలకు అందిస్తున్న మౌలిక సదుపాయాల కల్పనను ప్రశంసిస్తూ అభినం దించారు. రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ గోడిలంక అధ్యక్షులు రుద్రరాజు రమేష్ రాజు, ఉప్పే నరసింహారావు, శెట్టిబత్తుల సత్యనారాయణ, మోసుగంటి విజయ కుమారి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 40 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు..ఉపాధ్యాయురాలు ప్రభారాణికి సన్మానం




**కరప, (రాజధాని వార్తలు):** గురజనాపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు విశిష్ట సేవలందించిన జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మాదిరెడ్డి ప్రభారాణి పదవీ విరమణ సందర్భంగా పాఠశాల ఉపాధ్యా యులు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. పబ్బినీడి పాపారావు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన మాదిరెడ్డి ప్రభారాణికి ప్రధానోపాధ్యాయుడు ఏ.సాయిమోహన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ 1986లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ప్రభారాణి దాదాపు 40 సంవత్సరాల పాటు ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఆదర్శవంతంగా సేవలందిం చడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల పట్ల సహనం, ఓర్పుతో బోధన సాగించడం ఆమె ప్రత్యే కత అని, నేటి ఉపాధ్యాయులు కూడా ఆ లక్షణాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రధా నోపాధ్యాయుడు ఏ.సాయిమోహన్ మాట్లాడుతూ ప్రభారాణి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభి వృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం గజమాల, దుశ్శాలువా, నూతన వస్త్రాలు, జ్ఞాపిక, సన్మాన పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. సన్మాన పత్రాన్ని ఉపాధ్యాయుడు వి.వి.రమణమూర్తి చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పబ్బినీడి పాపారావు, పి.వీరబాబు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, వై. వీరవేణి, ఎస్ఎంసీ చైర్మన్ పి.నూకరాజు, మండల విద్యాశాఖాధికారి పి. సత్యనారాయణ, యూటీఎఫ్ నాయకులు నాగేశ్వరరావు, రాజుబాబు, రమణ, ఉపాధ్యాయులు టి.వేణుగోపాల్, వి.శోభాకర్, ఏ. సూర్యనారాయణ, ఎన్.యు.రావు, పి.భవానీ, పి.ఎం. మాణిక్యాంబ, వ్యాయామ ఉపాధ్యాయుడు కే.ఎన్.రావు తదితరులు పాల్గొని ప్రభారాణికి శుభాకాంక్షలు తెలిపారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎడ్జ్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిన్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# సాయికృష్ణ కేసు.. మరో ఇద్దరు కానిస్టేబుళ్లకు 14 రోజుల రిమాండ్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో మరో ఇద్దరు పోలీసులను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. కేసులో నిందితులుగా ఉన్న కానిస్టేబుళ్లు బాబురావు, సాంబయ్యలను అదుపులోకి తీసుకున్న అధికారులు.. వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం జిల్లా కోర్టులో హాజరుపర్చారు. ఈ సందర్భంగా కోర్టుకు సిట్ అధికారులు.. రిమాండ్ రిపోర్ట్‌ను సమర్పించారు. ఇద్దరు కానిస్టేబుళ్లకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. వారిని అవనిగడ్డ జైలుకు తరలించాలంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

**రిమాండ్ రిపోర్ట్‌లోని అంశాలు..**

'బాబురావు, సాంబయ్య సాక్ష్యాలను మాయం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్లోని సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను మార్చేశారు. వేరే హార్డ్ డిస్క్‌లను అమర్చి సాక్ష్యాలను ధ్వంసం చేశారు. సాయికృష్ణ మృతదేహం ఎక్కడుందో ఇప్పటికీ తెలియలేదు. అరెస్ట్ అయిన నిందితులు విచారణకు సహకరించడం లేదు. దర్యాప్తును పక్కదారి పట్టిస్తున్నారు. పోలీసులు కావడంతో సాక్ష్యాలను ప్రభావతం చేసే అవకాశం ఉంది' అంటూ రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ అధికారులు పేర్కొన్నారు.




# ఏలూరు జిల్లాలో పెద్దపులి కలకలం.. ఆవుపై దాడి చేసి చంపిన పులి

**ఏలూరు జిల్లా, (రాజధాని వార్తలు):** ఏలూరు జిల్లాలో పెద్దపులి సంచారం స్థానిక ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తోంది. వేలేరుపాడు మండలంలోని చింతలపాడు గ్రామ సమీపంలో బుధవారం తెల్ల వారుజామున ఓ ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనతో గ్రామస్థులు అప్రమత్తమవగా, అటవీ శాఖ అధికారులు పులి కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారు. పులికి రేడియో కాలర్ అమర్చి దాని కదలికలను ట్రాక్ చేస్తున్నారు. రేడియో కాలర్ ద్వారా అందుతున్న సంకేతాల ఆధారంగా పులి ప్రస్తుతం యడవల్లి అటవీ ప్రాంతం వైపు వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పులి సంచారం ఉన్న ప్రాంతాలపై అటవీ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. చింతలపాడు గ్రామ సమీపంలో పులి ఆవుపై దాడి చేయడంతో పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆయా గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాలకు వెళ్లే వారు, పశువులను మేపేందుకు వెళ్లే రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని హెచ్చరించారు. పులి గ్రామల్లోకి రాకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పులిని సురక్షితంగా బంధించి తిరిగి అటవీ ప్రాంతంలోకి తరలించేందుకు బోన్లు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అవసరమైతే ప్రత్యేక బృందాలను రంగంలోకి దించేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు నిరంతరం పరిస్థితిని పర్య వేక్షిస్తూ స్థానిక ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పులి కనిపించిన వెంటనే సమాచారం అందించాలని గ్రామస్థులకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.



# కృష్ణా తూర్పు డెల్టా కాలువలకు 3200 క్యూసెక్కుల నీరు విడుదల



**అమరావతి, (రాజధాని వార్తలు):** కృష్ణా డెల్టాకు నీరు విడుదలైంది. బుధవారం కృష్ణా తూర్పు డెల్టా కాలువలకు 3200 క్యూసెక్కుల నీటిని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నేత గద్దె అనూరాధ, ఆంధ్రప్రదేశ్ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తదితరులు హాజరయ్యారు. ఎగువన వర్షాలు లేకపోవడంతో ఇరిగేషన్ అధికారులు పులిచింతల ప్రాజెక్టులోని నీటిని డెల్టా అవసరాలకు వాడుతున్నారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులో వరద వచ్చే వరకు పులిచింతల నీరే ఆధారంకానుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కృష్ణా డెల్టాలో పుష్కలంగా రైతులు పంటలు పండించాలని ఆకాంక్షించారు. 3200 క్యూసెక్కుల నీటిని నేడు కృష్ణా తూర్పు డెల్టాకు విడుదల చేశామని తెలిపారు. కృష్ణమ్మకు పసుపు, కుంకుమ సారే సమర్పించి నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. ఏరువాక కార్యక్రమం తరువాత నీటి విడుదల అనేది రైతులకు ఆనందించదగ్గ రోజని కలెక్టర్ వెల్లడించారు. ఏపీలో ఇప్పటికే రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద నిధులను అందించిందని ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తెలిపారు. జులై 1న నీటి విడుదల ఉంటుందని చెప్పారని... చెప్పినట్టే నేడు మంత్రి నిమ్మల రామానాయుడు మార్గదర్శకత్వంలో కలెక్టర్ నీటిని విడుదల చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎల్‌నినోపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారని.. ఆ కారణంగా మంత్రి నిమ్మల రామానాయుడు ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని గోపాలకృష్ణ పేర్కొన్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం... ఏపీలో వారం రోజుల పాటు భారీ వర్షాలు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లో వారం రోజుల పాటు భారీ వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. జులై 3న వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాబోయే వారం రోజులు వర్షాలు కురిసే పరిస్థితి ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా ఉత్తర కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అలాగే కోస్తా తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్రంలోకి వెళ్లిన వారు వెంటనే తీరానికి చేరుకోవాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan